# వి.కోటలో నకిలీ విత్తనాల జోరు

**లబోదిబోమంటున్న రైతన్నలు..**
**వేలల్లో నష్టపోతున్నామని ఆవేదన !!**


చిక్కుడు పంట

వి.కోట, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త
రైతుల నమ్మకాన్ని వమ్ము చేస్తూ వి.కోట మండలంలో కొందరు విత్తనాల వ్యాపారులు రైతుల నెత్తిన నకిలీ విత్తనాలు అంటకడుతూ రైతులను దగా చేస్తున్నారు. అవి అసలైనవో నకిలీ విత్తనాలో తెలియక రైతులు పంటను ఎంతో ఆశగా సాగు చేసి చివరకు దిగుబడి సమయంలో ఢీలా పడుతున్నారు. మండలంలో ఇటీవలి కాలంలో రైతులకు కొందరు వ్యాపారులు నకిలీ చిక్కుడు విత్తనాలు విక్రయించడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మార్కెట్లో చిక్కుడు కాయలు పది కిలోలు రూ 400-1200దాకా ధర పలుకుతున్నాయి. దీంతో రైతులు చిక్కుడు కాయల సాగుపై ఆసక్తి చూపారు. ఇదే అదునుగా భావించిన విత్తన దుకాణ దారులు రైతులకు తక్కువ ధరకే విత్తనాల పేరిట నకిలీ విత్తనాలు అంటకట్టారు. చిక్కుడు విత్తనాలతో అదే పోలికతో ఉన్న అనప విత్తనాలు కలిపి విక్రయించారు. కిలో విత్తనాలు రూ 750నుంచి 5వేల దాకా విక్రయిస్తున్నారు. దీంతో నకిలీ విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. విత్తనాల కొనుగోళ్లపై రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాల్సి ఉండగా అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలో సుమారు వంద హెక్టార్లలో రైతులు చిక్కుడు సాగు చేశారు. ఎకరా సాగుకు 50-60వేల దాకా రైతులు ఖర్చు చేస్తున్నారు. అయితే పంట దిగుబడి మాత్రం అంతంతే. పాపేపల్లి, గాండ్లపల్లి, బిసిపల్లి, నక్కనపల్లి, గోనమాకులపల్లి, కృష్ణాపురం తదితర గ్రామాల్లో రైతులు నకిలీ విత్తనాల బారిన పడి లబోదిబోమంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో నకిలీ విత్తనాల విక్రయాలు అరికట్టేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## శ్రీవారి సేవలో కలెక్టర్



తిరుమల, ఫిబ్రవరి 11ప్రభాతవార్తప్రతినిధి:
శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరికీ మంచి జరగాలని వేడుకున్నట్లు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆయన కుటుంబసభ్యులతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అదికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## ముగిసిన గోవిందరాజుని తెప్పోత్సవాలు



తిరుపతి, ఫిబ్రవరి 11ప్రభాతవార్త: తిరుపతి గోవిందరాజస్వామి తెప్పోత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. చివరిరోజు మంగళవారం రాత్రి స్వామివారు శ్రీదేవిభూదేవిలతో కలసి తెప్పపై విహరించారు. ఆలయ పుష్కరిణిలో శ్రీదేవిభూదేవి గోవిందరాజులు భక్తులకు అభయమిచ్చారు. ఈ తెప్పోత్సవాల్లో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి జెఈఓ వీరబ్రహ్మం, ఎప్‌ఎసిఓ బాలాజీ, ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.




## "కల్తీనెయ్యి" పాపంలో
# పోలీసు కస్టడీకి నిందితులు?

**-ఆ మూడు డైరీలు మూతబడుతాయా!! -అసలు సూత్రధారులు టిటిడి మాజీలేనా!?**

ప్రభాతవార్త-తిరుపతి:
తిరుమల లడ్డూలకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన పాపంలో కటకటాల్లో ఉన్న నలుగురు నిందితులు పోలీసుకస్టడీకి తీసుకుంటే తప్ప అసలు సూత్రధారులు ఎవరనేది తేలదనేది ఇప్పుడు సంచలనంగా మారింది. గత ఐదేళ్ళలో కనీసం నెయ్యితయారీ అర్హతలేని డైరీలు టెండర్లు దక్కించుకోవడం వెనుక టిటిడి పెద్దలు, అధికారుల పాత్ర ఎంతనేది ఆ నలుగురినీ లోతుగా విచారణ చేస్తే తప్ప నిజం బయటకు రాదనేది సిబిఐ సిట్ అధికారుల సమాచారం. ఈ నేపధ్యంలో ఆదివారం అరెస్టయి రిమాండ్‌లో ఉన్న నిందితులు ఏఆర్ డైరీ యాజమాన్యం ఎండి రాజ శేఖరన్‌తోబాటు సరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, పోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక)సిఈఓఅపూర్వవినయ్‌కాంత్‌చావ్డాల కస్టడీ కోరుతూ సిబిఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దేవునికే మోసం చేసి కల్తీనెయ్యి పంపిన కేసులో కీలకంగా ఉన్న తమిళనాడు ఏఆర్ డైరీ, వైష్ణవీడైరీ, బోలేబాబాడైరీలు మూడింటిని కూడా శాశ్వతంగా మూసివేసే పరిస్థితులు లేకపోలేదనేది తెలుస్తోంది. అతి పెద్ద ధార్మికసంస్థ టిటిడినే ఇలా మోసం చేశారంటే ప్రజలకు విక్రయిస్తున్న పాలు, పెరుగు, నెయ్యి ఎంతవరకు నాణ్యతతో కూడినవనేది ఇప్పుడు ఆందోళనకలిగిస్తున్న విషయం. ఇంత పెద్దతప్పిదాలకు గత టిటిడి పెద్దలు, కొందరు అధికారుల ప్రమేయం ఉందనేది బలమైన వాదన కూడా. అసలు కాంట్రాక్టు ఎలా ఇచ్చారనేది, ఈ కల్తీ పాపంలో కీలక సూత్రధారులను తేల్చే పనిలో సిబిఐ సిట్ అధికారులు వ్యూహాత్మకంగా ముందుకు కదులుతున్నారు. లోపాయికారి ఒప్పందం, తప్పిదాలు చేశారనేది సిబిఐ విస్తుపోయే నిజాలు సేకరించింది. గత ఐదేళ్లలో నాణ్యతలేని, కల్తీ నెయ్యి తక్కువ ధరకు సరఫరా చేస్తామని డైరీల యాజమాన్యం, కాంట్రాక్టర్లు ఆసక్తిచూపడం, కల్తీ నెయ్యేగాక ఏకంగా జంతువుల కొవ్వు, పామాయిల్, పందికొవ్వు , చేపనూనెతో బాటు ఇతరత్రా సోయాబీన్, పొద్దుతిరుగుడు, ఆలివ్, గోధుమబీన్, మొక్కజొన్న, పత్తిగింజలతో నూనె వినియోగించారనేది నిందితుల రిమాండ్ రిపోర్టులో చోటుచేసుకున్న అంశం. గత ఐదేళ్ళలో పనిచేసిన టిటిడి అధికారులు, గత ధర్మకర్తలమండలికి ఈ వాస్తవాలు తెలియవా?! తెలిసినా కమీషన్ల కోసం కక్కుర్తిపడి నోరుమూసుకుని పాలనసాగించారా అనేదిసిబిఐ సేకరించిన ఆధారాల్లో కీలకంగా మారాయి. గత ఏడాది జూన్‌లోనే లడ్డూలకు కల్తీనెయ్యి వాడారనేది గుజరాత్‌లోని ఎన్‌డిడిబి ల్యాబరేటరీ(పరిశోధనశాల)నుండి ఆధారాలు సేకరించారు. ఈ ఫలితాల్లో నెయ్యికల్తీ అయిన మాట వాస్తవమేనని, అయితే కొన్ని రకాల ఆహారపదార్థాల నూనెలు కలిపారనేది టిటిడి అధికారులు కూడా వెల్లడించారు. తిరుమల లడ్డూప్రసాదం తయారీలో మంచిశెనగపప్పు, జీడిపప్పు, చక్కెర, ఎండుద్రాక్ష, యాలకులు, కలకండ, పచ్చకర్పూరం తదితర మిశ్రమాలను వినియోగిస్తారు. అయితే కల్తీ నెయ్యి సరఫరా విషయంపై గత ఏడాది టిటిడి మార్కెటింగ్ కొనుగోళ్ళ జిఎం మురళీకృష్ణ తిరుపతి ఈస్టు పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఆధారంగా తీసుకుని ఇప్పుడు అరెస్టయిన నలుగురు కీలక వ్యక్తులు, మరికొందరు వెల్లడించే సాక్ష్యాధారులతో ముందుకు వెళ్ళనున్నారు. కీలకసూత్రధారుల అరెస్టులుతప్పవనేది అందరిలోనూ రసవత్తర చర్చ.

# వైరింగ్ లోపాలే ప్రమాదానికి కారణం

**10 లక్షల మేర ఆస్తి నష్టం**
**ట్రాన్స్‌కో అధికారుల స్పష్టం**

ఐరాల, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:
విద్యుత్ వైరింగ్‌లో లోపాలు, కార్యాలయాల వద్ద అస్తవ్యస్తంగా విద్యుత్ సరఫరా జరుగుతుండడమే మండల కేంద్రం ఐరాలలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం సాయంత్రం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణమని ఇంజీరింగ్ నిపుణులు పరిశీలనలో తేలింది. ప్రమాదవశాత్తు తొండ విద్యుత్ ట్రాన్స్ పార్మర్‌పై పడడంతో మండల కేంద్రం ఐరాల శివారు(ఐరాల-చిత్తూరు రహదారి) లో ఎంపీడీఓ, తహశీల్దార్, వెలుగు, హౌసింగ్ తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి కంప్యూటర్లు, ఫ్యాన్‌లు కాలిపోవడంతో లక్షల్లో ఆస్తినష్టం జరిగిన సంఘటన విధితమే. ఈప్రమాదంలో ఆయా కార్యాలయాల్లోని విద్యుత్ మీటర్లు, కంప్యూటర్లు, యుపిఎస్‌లు, లాప్‌టాప్‌లు, ఎంసీబిలు. వైరింగ్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోవడంలో లక్షలాది రూపాయలు ఆస్తినష్టం జరిగిన విషయం విధితమే. ఈనేపథ్యంలో మంగళవారం ప్రమాద ఘటనను పైపల్లె ట్రాన్స్‌కో ఏడీఈ అరుల్‌కుమార్, ఐరాల ఏఈ నీరజలు తమ సిబ్బందితో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా



ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పురాతనమైన నాశిరకమైన వైరింగ్, వైరింగ్‌లో లోపాలు, కార్యాలయాల వద్ద అస్తవ్యస్తంగా విద్యుత్ సరఫరా, సరైన ఎర్తింగ్ లేకపోవడం వల్లనే పెద్దఎత్తున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు ట్రాన్స్‌కో అధికారులు గుర్తించారు. కార్యాలయాలకు సరైన ఎర్తింగ్ లేకపోవడాన్ని కూడా తమ పరిశీలనలో ట్రాన్స్‌కో అధికారులు గుర్తించారు. . ఈనేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో వైరింగ్ సక్రమంగా చేపట్టాలని ఏఈఓ అరుల్ కుమార్, ఏఈ నీరజలు అధికారులకు సూచించారు. ఇదిలా వుండగా మంగళవారం సాయంత్రానికి తహశీల్దార్ కార్యాలయానికి విద్యుత్ సరఫరా పునర్దురించగా మిగిలిన కార్యాలయాలకు మీటర్లను అమర్చి మీటర్ల వరకు ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్దరించారు.

**ప్రమాద ఘటనను పరిశీలించిన ఎమ్మెల్యే**

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదం జరిగిన ఐరాల మండల ప్రభుత్వ కార్యాలయాలను పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మంగళవారం అధికారులతో కలసి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను ఎంపీడీఓ, ధనలక్ష్మీ, తహశీల్దార్ మహేష్‌కుమార్, ట్రాన్స్‌కో ఏడీఓ అరుల్ కుమార్, ఏఈ నీరజలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా రికార్డులకు నష్టం వాటిల్లిందా అని ఆరా తీశారు. ప్రమాదంలో సుమారు 10 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మురళీమోహన్ ఫోన్ ద్వారా జడ్పీ సీఈఓ, జిల్లా కలెక్టర్‌ల దృష్టికి ఈ ప్రమాద విషయాన్ని గురించి తీసుకువెళ్లారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**-మహిళా గ్రూపులకు రూ.7.5కోట్లు చెక్కుల పంపిణీ -ఎమ్మెల్యే**




పలమనేరు, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:
మహిళలు అన్ని రంగాలల్లో రాణించాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మహిళలకు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వద్ద మహిళా గ్రూపు సభ్యులకు రూ. 7.5కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు ఎన్టీఆర్ మహిళలకు అండగా నిలుస్తూ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను తీసుకొచ్చారని, అదే విధంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం మహిళల అభివృద్ధి కోసం ద్వాక్రా మరియు దీపం లాంటి గొప్ప పథకాలను తీసుకువచ్చారన్నారు. నాడు చంద్రబాబు ఆలోచనతో పుట్టిన ద్వాక్రా గ్రూపులకు రుణాలనిచ్చేందుకు బ్యాంకులు నేడు క్యూ కడుతున్నాయని అందుకు మహిళలు బ్యాంకులకు కల్పించిన నమ్మకమే కారణమన్నారు. పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాలలో రాణించాలని కోరారు. ప్రభుత్వం మరియు బ్యాంకులు అందిస్తున్న సహకారాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ఖాదర్ భాషా, ఎపిఎం మొగిలీశ్వరయ్య, సిసి హరి, విజయ కుమారి, గురుమూర్తి, మండల అధ్యక్షులునాగరాజురెడ్డి, ప్రధాన కార్యదర్శి గణేష్, నాయకులు జగదీష్ నాయుడు, స్వతంత్రబాబు, మల్లీశ్వర్‌రెడ్డి, వెంకట రత్నం, రామూర్తి నాయుడు, సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు స్వాహా

**భూకబ్జాదారులు ఆక్రమించి వెంచర్లు ఏర్పాటు**
**పంచాయితీ, రెవెన్యూ ఆధికారుల పనితీరుపై ఆరోపణలు**


చెరువు భూమిలో అక్రమంగా వేసిన వెంచర్లు

దొరవారిసత్రం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త.
తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం అక్కరపాక పంచాయితీ రెవెన్యూ పరిధిలో నేషనల్ హైవే పక్కన ఉన్న అక్కరపాక చెరువు, చెరువు పోరంబోకు భూములు గత కొంత కాలంగా కొంత మంది భూకబ్జాదారులు ఆక్రమించి రియల స్టేటు వెంచర్లు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఆక్రమనలపై సంబందిత రెవెన్యూ అధికారులకు అక్కరపాక ఆయకట్టు కమిటీ, గ్రామ ప్రజలతో కలసి పలుమార్లు అర్జీలు ఇచ్చినా ప్రయోజనం జరగట్లేదని ,ఆక్రమనలు తొలగించకపోగా చెరువు భూములు రోజు రోజుకు ఆక్రమణలు ఎక్కువ అవుతున్నాయని స్తానిక గ్రామ ప్రజలు వాపోతున్నారు.

**ప్రభుత్వ ,చెరువు భూములకు రక్షణ కరువైందా...?**

ప్రభుత్వ భూములను కలపాడాల్సిన అధికారులు పనితీరుపై అక్కరపాక గ్రామ ప్రజలు పలు అనుమానాలను వ్యక్తపరుస్తున్నారు. అక్కరపాక పంచాయితీ కృష్ణాపురం సమీపంలో సర్వే నంబర్ 31,23 లో గల ప్రభుత్వ చెరువు భూములను కొంతమంది భూ భకాశురులు చెరువు భూములను ఆక్రమించి అమ్ముకుంటున్నారు. ఒక్కోకరు నాలుగు ,ఐదు ప్లాట్లు చొప్పున సుమారు 50 ఎకరాలు ఆక్రమించి రియల్‌స్టేటు వెంచర్లు ఏర్పాటు చేస్తున్నా పంచాయితీ రెవెన్యూ అధికారులు మాత్రం తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తుండడంపై స్తానిక ప్రజలు అధికారుల పనితీరుపై పలు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. ఉన్నతధికారులు అక్కరపాక చెరువు భూములను రక్షించాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

# ఇంటి స్థలం దురాక్రమణ..

**తహసీల్దారు కార్యాలయం ఎదుట సొమ్మసిల్లిన పండుటాకు**



తహసీల్దారు కార్యాలయం ముందు పడిఉన్న వృద్ధురాలు
గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి పట్టా

గంగవరం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త :
మండలంలోని గంద్రాజుపల్లె పంచాయతీ జంగాలపల్లెలో పక్కా స్థలాలు కబ్జాకు గురి కావడంతో గ్రామానికి చెందిన పండుటాకులు లబోదిబో మంటున్నారు. గతంలో ప్రభుత్వం పండుటాకులకు కేటాయించిన పక్కా స్థలాలను గ్రామానికి చెందిన కొందరు కబ్జా కోరులు దర్జాగా ఆక్రమిస్తున్నారు. గ్రామానికి చెందిన 12 మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఇది సివిల్ మేటర్ తమకు సంబంధం లేదని రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్ళి వారి వద్ద నుండి కబ్జాకు గురైన స్థలం నీకే చెందుతుందని రెవెన్యూ అధికారులు ధృవీకరించి తమ దృష్టికి తీసుకువస్తే దానిపై విచారించి న్యాయం చేస్తామని పోలీసులు చెప్పడంతో పండుటాకులు మంగళవారం ఉదయం నుండి స్థానిక తాహసీల్దారు కార్యాలయం వద్ద పడిగాపులు కాచిన అక్కడ ఎవరూ పట్టించుకోకపోగా రెవెన్యూ అధికారులు కూడా కబ్జా దారులకే మద్దతు పలుకుతున్నారని బాధితులు వాపోయారు. బాధితుల్లో ఒక్కరైనా లక్ష్మమ్మ(65) అనే వృద్ధురాలు న్యాయం కోసం ఉదయం నుండి కార్యాలయం వద్దనే ఎదరు చూసి మధ్యాహ్నం భోజనం చేయకపోవడం, ఎండలు విపరీతంగా ఉండడంతో ఆ వృద్ధురాలు అక్కడే సొమ్మసిల్లి పడిపోయింది. వృద్ధురాలు సొమ్మసిల్లి పడిపోయినా రెవెన్యూ అధికారులు మాత్రం కనీసం మానవత్వం కూడా లేకుండా వృద్ధురాలును పట్టించుకోలేదు. చివరికీ తాహసీల్దారు కార్యాలయం తనిఖీ చేయడానికి వచ్చిన పలమనేరు ఆర్డీవో భవాణికు ఫిర్యాదు చేయడంతో ఆర్డీవో వెంటనే వృద్ధుల సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది.


**కాదేది మోసానికి అనర్హం**
- సైబర్ నేరగాళ్ళతో అప్రమత్తం- ఎస్పీ మణికంఠ చందోలు

**ఆ ముగ్గురు ఆచూకీ లభ్యం?**
బంధువుల ఇంటిలోనే మకాం

**వైష్ణవీదేవిని తాకిన భాస్కరుడి కిరణాలు**

4లో




# వైసిపిలో గాలి జగదీశ్ చేరిక వాయిదా

పుత్తూరు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :
దివంగత నేత గాలి ముద్దుకృష్ణమనాయుడు రెండో కుమారుడు గాలి జగదీశ్ వైఎస్సాఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరే కార్యక్రమం నిరవధికంగా వాయిదా పడింది. ఈ నెల 12వ తేదీన తాడేపల్లిలో ఆ పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి సమక్ష ంలో ఆయన వైసిపిలో చేరాల్సి వుంది. ఆ మేరకు నగరి నియోజకవర్గంలో ఆయన అనుచరులతో కలిసి పలు వాహనాల్లో మంగవారం సాయంత్రం తిరుపతి నుంచి విజయవాడకు వెళ్లి పార్టీలో చేరేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం రాజధానికి రావాల్సిందిగా అధిష్టానం నుంచి సమాచారం వచ్చింది. వెంటనే అక్కడకు చేరుకున్న జగదీశ్‌కు... పార్టీ అధినేత జగన్మోహనరెడ్డికి వ్యక్తిగత పనులున్నందున కార్యక్రమాన్ని వాయిదా వేయడం జరిగిందని, మరో తేదీ చెప్పాలని ముఖ్య నాయకులు స్పష్టం చేశారు. హఠాత్తుగా చేరిక కార్యక్రమం వాయిదా పడడంతో నియోజకవర్గంలో ఆయన వైసిపిలో చేరాలని కోరుకుంటున్న టిడిపి, వైసిపి ఇరు పార్టీల్లోనూ క్యాడర్ ఒక్కసారిగా డీలా పడిపోయింది. అయితే త్వరలోనే మరో తేదీ నిర్ణయంచుకుని వైసిపిలో చేరతామని జగదీశ్ ప్రకటించడంతో కలకలం సద్దుమణిగింది.

**జోరుగా రోజా రాజీనామా ప్రచారం**

గాలి జగదీశ్ వైసిపిలో చేరే విషయమై మొదటి నుంచి అయిష్టంగా వున్న మాజీ మంత్రి ఆర్.కె.రోజా ఆయన రాకను అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దాంతో ఆయన చేరికను అడ్డుకునేందుకు తిరుగులేని రాజీనామా అస్త్రాన్ని ప్రయోగించారని ప్రచారం జరిగింది. మంగళవారం నగరి నియోజకవర్గ రాజకీయాల్లో ఈ ప్రచారం జోరుగా సాగింది. జగదీశ్ పార్టీలో చేరితే తాను వైసిపికి రాజీనామా చేస్తానని రోజా అల్టిమేటం జారీ చేయడంతో విధి లేక పార్టీ అధిష్టానం తమ నిర్ణయాన్ని వాయిదా వేసుకోవాల్సి వచ్చిందని వైసిపిలో ఆమె వర్గీయులు చెబుతున్నారు. ఇదిలా వుండగా గాలి జగదీశ్‌ను పార్టీలో చేర్చుకోవాలని అధినేత జగన్మోహనరెడ్డి నిర్ణయించుకున్నపుడే దాని పర్యవసానాలు కూడా ఆలోచించి వుంటారని, అన్ని కోణాల్లో ఆలోచించి, ముఖ్య నేతలతో చర్చించిన తర్వాతే జగదీశ్‌ను పార్టీలో చేర్చుకోవాలనే నిర్ణయం తీసుకుని వుంటారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. విజయసాయిరెడ్డి, వేంరెడ్డి ప్రభాకరరెడ్డి లాంటి నేతలు పార్టీని వీడినపుడు కూడా జగన్ పెద్దగా స్పందించలేదని అందువల్ల రోజా రాజీనామా అంశం జగదీశ్ చేరికపై ప్రభావం చూపదని వాదిస్తున్నారు. అయితే రోజా వర్గీయులు మాత్రం నగరి నియోజకవర్గంలో తమ నాయకురాలి ఆధిపత్యానికి తిరుగులేదని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## ఇంటర్ ప్రయోగ పరీక్షల పేరుతో
# అక్రమ వసూళ్లు!

**-ఎగ్జామినర్స్ టైం లోనే పుట్టుకొస్తున్న ప్రయోగశాలలు**
**-నిబంధనలు బేఖాతరు -నిద్రమత్తు వీడని ఇంటర్ బోర్డు**

తిరుపతి విద్య ఫిబ్రవరి 11 ప్రభాతవార్త
విద్యార్థుల భవిష్యత్తు ఇంటర్మీడియట్ కీలకమైంది. అటువంటి ఇంటర్ విద్యను నారాయణ, శ్రీచైతన్య సంస్థలు తమ పలుకుబడిని అస్త్రంగా ప్రయోగించి తమ కార్పొరేట్ సామ్రాజ్యాన్ని నలుదిశలా విస్తరిస్తున్నాయి. ఒకవైపు అడ్మిషన్ ఫీజు..మరోవైపు కళాశాల ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రుల్ని పీల్చి పిప్పి చేస్తున్న ఈ కార్పొరేట్ కళాశాలలు తాజాగా ప్రయోగ పరీక్షల కోసం అక్రమ వసూళ్లకు తెరతీశాయి. ప్రయోగ పరీక్షల్లో ఎగ్జామినర్స్ ను మ్యానేజ్ చేసి మార్కులు ఎక్కువ వేయిస్తామని చెబుతూ చేస్తున్న అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఫీజుల పేరుతో కోట్లాది రూపాయలు దండుకుంటున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని వీరి దందా కు మౌనం వహించాల్సి వస్తుందని వాపోతున్నారు. మానసిక ఉల్లాసం..ఆహ్లాదకర వాతావరణం..శాస్త్రీయ పద్ధతులు. .ప్రయోగాత్మక ఇంటర్ విద్యా బోధన చేస్తామంటూ పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తూ ప్రైవేటు, కార్పొరేట్ దిగ్గజాలు నారాయణ, శ్రీ చైతన్య విద్యాసంస్థలు విద్యార్థులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. చాలీచాలని గదుల్లో అనుమతించిన సంఖ్య కన్నా విద్యార్థులను అధికంగా చేర్చుకుంటున్నా ఇంటర్ బోర్డు అధికారులు చోద్యం చూడటం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాఠ్యాంశ బోధన కన్నా ప్రయోగాత్మకంగా వివరించడం వల్ల విద్యార్థులకు ఆ అంశంపై పూర్తి స్థాయి అవగాహన కలుగుతుంది. అయితే ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలు తమ సొంత మెటీరియల్ ప్రచురించి విద్యార్థులపై రుద్దుతున్నారు. దీంతో విద్యార్థులు రోబోలా తయారవుతున్నారే తప్ప సృజనాత్మకతను కోల్పోతున్నారనే వాదన మేధావుల నుంచి బలంగా అనిపి స్తుంది. తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం కార్పొరేట్ విద్యాసంస్థలలో చేర్పిస్తే వారిని యంత్రాలు లాగా తయారు చేస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. విద్యార్థి దశలో ఇంటర్ విద్య ఎంతో కీలకమైంది. ముఖ్యంగా ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు పాఠ్యాంశాలకు అనుగుణంగా ప్రయోగశాలలో బోధన నిర్వహించాల్సి ఉంది. అయితే అందుకు భిన్నంగా రెండో సంవత్సరం ఆఖరిలో మొక్కుబడి తంతుగా ప్రయోగశాలకు తీసుకెళ్తున్నారే తప్పా విద్యార్థులలో పూర్తిస్థాయి అవగాహన కల్పించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఇంటర్మీడియట్ లో బైపీసీ, ఎంపీసీ విభాగాలకు ప్రథమ సంవత్సరం నుంచే వారానికి ఒకసారైనా ప్రయోగాలు నిర్వహించాలి. చాలాచోట్ల ఆ పరిస్థితి లేదు కొన్ని చై...నా కళాశాలలో ప్రయోగశాలకు అసలు గదులు లేవు. జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ప్రయోగాలు దాఖలాలు కనిపించడం లేదు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ముఖ్యంగా జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు రెండో సంవత్సరంలో చివరిలో మాత్రమే ప్రయోగ ఆధారిత బోధన చేస్తారు. ప్రయోగశాలలు సక్రమంగా నిర్వహించక పోయినా ఇంటర్ బోర్డు అధికారులు ఎటువంటి తనిఖీలు నిర్వహించడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు కార్పొరేట్ కళాశాలలు ఎక్కువగా ప్రాక్టికల్స్ మార్కులపైన దృష్టి కేంద్రీకరిస్తాయి అనేది జగమెరిగిన సత్యం. కార్పొరేట్ కళాశాల పరంగా ఇంటర్ తో పాటు ఎంసెట్ ర్యాంకులకు ప్రయోగ మార్కులు ప్రధాన పాత్ర పోషిస్తూ వస్తున్నాయి. ప్రాక్టికల్స్ తూతూ మంత్రంగా నిర్వహించి ప్రథమ సంవత్సరం పరీక్షల ఫలితం ఆధారంగా మార్కులను వేసేవారు. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు పూర్తిస్థాయిలో ప్రయోగ పరీక్షలు చేసినా నూరు శాతం మార్కులు రావడం గగనములా తయారైంది. అదే చై...నా కళాశాలకు చెందిన విద్యార్థులకు నూరు శాతం మార్కులు వస్తాయి. నెల 10 నుంచి ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఆయా చై...నా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి రూ.1000 నుంచి 3000 చొప్పున వసూలు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## చిత్తూరు పార్లమెంటు అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నా

– ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



చిత్తూరు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జవాబుదారితనంగా శ్రమిస్తున్నట్లు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. ఢిల్లీలో జరుగుతున్న పార్లమెంటు సమావేశాలకు హాజరవుతున్న ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పార్లమెంటు సమావేశాల్లో చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్లమెంటులో పలు అంశాలను ప్రస్తావించడంతో పాటు మరోవైపు రాష్ట్ర హక్కులు, ప్రయోజనాల కోసం దృష్టి కేంద్రీకరిస్తున్నారు. రాష్ట్ర విభజన చట్టం హామీలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వంకు విన్నవిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం కూటమి ఎంపీలు ఐక్యంగా పనిచేస్తున్నామన్నారు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారుల సమన్వయంతో పార్లమెంటుస్థానంనుఅభివృద్ధిలోఉన్నతంగానిలబెట్టడానికి తాను శక్తివంచన లేకుండా శ్రమిస్తున్నానన్నారు.

## విద్యార్థులకు కళ్ళజోళ్ళు పంపిణీ

యాదమరి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఎంపిడిఓ వేణు, పిహెచ్‌సి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్‌లు కళ్ళజోళ్ళను అందజే శారు. ఎంపిడిఓ వేణు, డాక్టర్ అనిల్‌కుమార్ నా యక్‌లు మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి లేకుండా చదువుకోవడానికి కంటి చూపు తక్కువగా వున్న వారికి కళ్ళజోళ్ళు ఉపయోగపడుతాయన్నారు. పిహెచ్‌సి సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యాదమరి పిహెచ్‌సి పరిధిలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని, అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా కళ్ళజోళ్ళను మంజూరు చేసిందని వీటిని మంగళవారం నుండి విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ప్రసాద్, రుక్మిణిలు, పాఠశాల హెడ్మాస్టర్ గిరిరాజా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

పెనుమూరు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: విద్యుత్ సరఫరాకు అంతరాయం కాకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో డిఇ శేషాద్రిరెడ్డి అధికా రులను ఆదేశించారు. ట్రాన్స్‌కో డిఇ శేషాద్రిరెడ్డి మంగళవారం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయ ఆవరణలో ట్రాన్స్‌కో ఎఇ తులసీ ప్రసాద్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఇ శేషాద్రిరెడ్డి మాట్లాడుతూ వేసవి రానుండటంతో వినియోగ దారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించడానికి అవసరమైన అన్ని చర్యలు పక్కాగా చేపట్టా లన్నారు. అలాగే పెనుమూరు మండల పరిధిలో గృహ వినియోగదారుల విద్యుత్ అదనపు లోడ్ బకాయిలు 50 లక్షల రూపాయల వరకు వున్నాయని వీటిని త్వరితంగా రికవరీ చేయడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## ఎన్నికల హామీలు అమలుకు సిఎం చంద్రబాబు కృషి

– ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

రామకుప్పం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



ఎన్నికల సమయంలో ప్రజలు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు సిఎం చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. మంగళ వారం రామకుప్పం మండల తెదేపా సమావేశం స్థానిక శ్రీ సుబ్రమణ్యాస్వామి ఆలయం వద్ద మం డల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ ఉగాది పండగ అనంతరం ఎన్నికల హామీలైన ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణం, తల్లికివందనం, రైతులకు చేయూత వంటి పథకాల అమలుకు సిఎం చంద్రబాబు కసరత్తులు చేస్తున్నారన్నారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు, తాగునీరు, నూతన భవనాల నిర్మాణం తదితరాలు మంజూరయ్యాయన్నారు. కుప్పం ప్రాంత ప్రజలు తమ సమస్యలపై జన నాయకుడు పోర్టల్‌ను సద్వినియోగం చేసుకునేలా నేతలు చొరవ చూపాలన్నారు. సమావేశంలో రాష్ట్ర నేతలు డా॥ సురేష్‌బాబు, మునస్వామి, సిఎం పిఎ దుర్గా ప్రసాద్, నేతలు నరసింహులు, ఆంజనేయరెడ్డి, సీతాపతి, శ్రీనివాసులురెడ్డి, రామూర్తి, చిన్నకృష్ణ, చలపతి, కన్నన్, గంట్లగౌడు, నందారెడ్డి, కృష్ణనాయక్, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా నేరాలపై అప్రమత్తం

– ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన

– కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు

*చిత్తూరు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:*

సోషల్ మీడియా నేరాలపై ప్రజలు అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలులు పేర్కొన్నారు. అలాగే పిల్లలు, యువత, పెద్దలు ఇంటర్నెట్ వినియోగంపై అవగాహన పెంచుకుని దీని నుండి జరిగే అనర్థాల నుండి మనల్ని మనం కాపాడుకోవాల్సిన అవసరం వుందన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలులు కలిసి మంగళవారం సైబర్ క్రైమ్స్, మహిళలు, ఆడపిల్లల భద్రత తదితర అంశాలపై డిఎస్పీలు, సైబర్ క్రైమ్ పోలీసులు, ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ ఆర్ఐఓ, మండల విద్యాశాఖ అధికారులు, ప్రైవేటు పాఠశాలల ప్రిన్సిపాళ్ళు, హైస్కూల్ హెడ్మాస్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలులు మాట్లాడుతూ సమాజంలో సోషల్ మీడియా వినియోగం ఎక్కువగా వుండటంతో నేరాలు పెరుగుతున్నాయన్నారు. దీని నుండి యువత, విద్యార్థులు, పిల్లలు, పెద్దలు అప్రమత్తంగా వుండాల్సిన అవసరం వుందన్నారు. ఇంటర్నెట్ అవసరమైన మేరకు మాత్రమే వినియోగించుకునేలా అవగాహన పెంచుకుని దీని నుండి ఎదురయ్యే సమస్యలు, నేరాల నుండి మనల్ని మనం కాపాడుకోవమే కాకుండా పిల్లలు, విద్యాలు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించే విషయంలో మండల విద్యాశాఖ అధికారులు చొరవ చూపాలన్నారు. ప్రైవేటు పాఠశాలల ప్రిన్సిపాళ్ళ వారి పరిధిలోని విద్యార్థులకు ఈ విషయంపై అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాల్లో భాగంగా పార్ట్‌టైమ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని వాట్సాప్ గ్రూప్‌లో సందేశాలు పంపించడం, తదితరాలుగా మోసపోతున్నారన్నారు. బ్యాంకు లావాదేవిలపై ఓటిపినేరాలు,క్యూఆర్‌కోడ్‌స్కాన్‌ఉపయోగించి మోసాలు జరుగుతున్నాయన్నారు.

## ఘనంగా దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి



పుత్తూరు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : పట్టణంలో భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆర్ఎస్ఎస్, జనసంఘ దివంగత అధ్యక్షుడు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పుత్తూరు మండల ఒబిసి అధ్యక్షుడు హరి మాట్లాడుతూ దీనదయాళ్ ఏకాత్మ మానవతావాదాన్ని ప్రవచించారని, సమగ్ర భారతాన్ని తీర్చిదిద్దాలని తన జీవితాన్ని త్యాగం చేసిన ఆధునిక మహర్షి అని కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఇ.శ్రీధర్, శంకర్, మధు, మునస్వామి, గణేష్, కిషోర్, వెంకటరామరాజు, ధర్మయ్య, రాజేంద్ర, సుబ్రమణ్యం, మునిలక్ష్మి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## మసెమ్మ జాతరకు ఏర్పాట్లు



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త మండలంలోని కొండచర్ల కురప్పల్లె మసెమ్మ జాతరకు గ్రామస్థులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరిగే ఈ జాతర ఈ నెల 12,13వ తేదీల్లో జరగనుంది. మసెమ్మ జాతరకు సుమారు 158 సంవత్సరాల చరిత్ర ఉంది. కోరికలు తీర్చే అమ్మవారిగా కొలువై ఉండడంతో జిల్లా వాసులే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

## మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టండి

–ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



పలమనేరు, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త: మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని నిధులను మొదటి ప్రాధాన్యత క్రమంలో తాగునీటి కోసం ఖర్చు చేయాలని తెలిపారు. మండలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ఇప్పటినుండే చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలో సి.సి.రోడ్లు, అంగన్వాడి భవనాలు, చెక్ డ్యాములు ఏర్పాటు, రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలు వాటి పరిష్కారం వివరాలు, మోడల్ పాఠశాలల ఏర్పాటుతో మూతపడనున్న పాఠశాలల వివరాలు తదితర సమస్యలపై పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు శాఖల అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి ప్రాజెక్టుల పోటీకి కెఐసి విద్యార్థుల ఎంపిక

కుప్పం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు ఈనెల 18వతేది బెంగళూరులో నిర్వహించే జాతీయ స్థాయి ప్రాజెక్టుల పోటీకి ఎంపికైనట్లు బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్, శామ్‌సంగ్ అధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి అన్వేషణ –2025ప్రాజెక్టుల పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు సత్తాచాటారన్నారు. బిటెక్ మూడో సంవత్సరం విద్యార్థులు అబ్దుల్ తౌహిద్, అరుణ్‌కుమార్ తయారు చేసిన బ్లేడ్ టెక్ ఇన్నోవేషన్ ప్రాజెక్టు నాలుగో బహుమతిగా ఎంపికై పదిహేను వేల నగదు గెలుచుకున్నారన్నారు. అలాగే పావన, శోభ అనే విద్యార్థినులు చేపట్టిన వేస్ట్ వర్త్ అనే ప్రాజెక్టుకు నాలుగో బహుమతిగా ఐదువేల నగదు గెలుచుకున్నారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సిఇఓ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, హెచ్ఒడి లోకేష్, జ్ఞానమూర్తి, రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

## మిట్టరాళ్లచేనులో తీరిన మంచినీటి సమస్య

కుప్పంరూరల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



మండలంలోని కొటాలూరు పంచాయతీ మిటరాళ్లచేను గ్రామంలో మంచినీటి సమస్యను సర్పంచ్ రాజేంద్రన్, మాజీ సర్పంచ్ సంజీవ రాజులు నాయుడు అధ్వర్యం లో పరిష్కరించారు. గ్రామంలో ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రామంలో నూతనంగా వేసిన మంచినీటి బోరుకు పైపులైను ఏర్పాటుచేసి నీటి సమస్యను పరిష్కరించారు. దీ ంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆశీస్సులతో పంచాయతీని మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

## నేడు మండల తెదేపా సమావేశం

శాంతిపురం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త

శాంతిపురం మండల తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం బుధవారం శాంతిపురం బాలాజీ కళ్యాణ మండపంలో జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, కార్యదర్శి నాగరాజు తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

## యువత సైబర్ నేరాలపై అప్రమత్తం

– కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా వుంచాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ సురక్షమైన ఇంటర్నెట్ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ డిఎఐఓ వెంకటేశ్వర్లుతో కలిసి సైబర్ మోసాలకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఫిబ్రవరి 2వ మంగళవారం ప్రపంచ సురక్షమైన ఇంటర్నెట్ దినోత్సవం నిర్వహించుకుంటున్నామన్నారు. డిజిటల్ అరెస్టులు, కెవైసి, ఓటిపి, నెట్ బ్యాంకింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ స్కామ్, క్రెడిట్ డెబిట్ స్కామ్స్, ఫిషింగ్, ఫేక్ యాప్స్, లోన్ స్కామ్స్, వర్క్ ఫ్రం హోమ్ స్కామ్స్, జాబ్ స్కామ్స్, యుపిఐ స్కామ్స్, లోన్ స్కామ్స్ వీటికి సంబంధించి ఎక్కువ మోసా లు జరుగుతున్నాయన్నారు. ఎవరైనాఫోన్‌చేసి ఆధార్, పాన్, బ్యాంకు వివరాలు అడిగితే చెప్ప కూడదన్నారు.

## గర్భిణీ స్త్రీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



పాలసముద్రం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: గర్భిణీస్త్రీలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాలసముద్రం పిహెచ్‌సి డాక్టర్ మోహన్‌కృష్ణ పేర్కొన్నారు. పాలసముద్రం పిహెచ్‌సిలో మంగళవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ మోహన్ కృష్ణ గర్భిణీ స్త్రీలకు బిపి, షుగర్, థైరాయిడ్ తదితర పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ పలు రకాల వైరస్‌లను దృష్టిలో వుంచుకుని గర్భిణీ స్త్రీలు తమ ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. పిహెచ్‌సిలో మంగళవారం నిర్వహించిన పరీక్షలకు 32 మంది గర్భిణీలు హాజరైతే అందులో 11 మంది గర్భిణీస్త్రీలు హైరిస్క్ కేసులుగా నిర్ధారించి వారికి తగు జాగ్రత్తలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళీ, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వాహనాలు తనిఖీ



పూతలపట్టు, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త మండల పరిధిలో ప్రభుత్వం నిబంధనల ప్రకారం సిఐ కృష్ణమోహన్ ఆదేశాల మేరకు రంగంపేట క్రాస్ ఓవర్ బ్రిడ్జి సర్కిల్ వద్ద మంగళవారం నాలుగు గంటల నుండి ఆరు గంటల వరకు ఏఎస్ఐ మనోహర్ తన బృందంతో వాహనాలకు తనిఖీ చేశారు. కార్లు ద్విచక్ర వాహనాలు లారీలు ఆటోలు లైసెన్సులను హెల్మెట్ సీట్ బెల్ట్ తనిఖీ చేశారు. ఆయన వెంట సిబ్బంది జయరాం, హరి, గోపి, రమణయ్య ఉన్నారు.

## మండల ప్రత్యేకాధికారి సుడిగాలి పర్యటన

చౌడేపల్లి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ, మండల ప్రత్యేకాధికారి నరేంద్రకుమార్ మంగళవారం మండలంలో పర్యటించారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు చేసిన ఆయన పలు రికార్డులు, ఆసుపత్రి గదులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి అవసరమయ్యే వసతులను అడిగి తెలుసుకొని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. అంతేకాకుండా మండలంలోని గడ్డంవారిపల్లి, తెళ్ళనీళ్ళపల్లి, ఆమినిగుంటల్లోని పాఠశాలలను పర్యవేక్షించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో మౌళిక వసతులను అడిగి తెలుసుకొన్నారు. వాటితోపాటు అంగన్‌వాడీ కేంద్రాలు, ఎస్సీ బాలురు, బాలికలు, బిసి బాలుర వసతి గృహాలను తనిఖీ చేసారు. ఎంపిడిఓ లీలామాధవి, ఎంఇఓ కేశవరెడ్డి, వైద్యాధికారి పవన్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇఇ చందన, ఐసిడిఎస్ సూపర్ వైజర్ రమాదేవి ఆయా శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

## శికారిపాళెం వద్ద సోలార్ సొబగులు

–స్థల పరిశీలన



దిగువపల్లి(చౌడేపల్లి), ఫిబ్రవరి 11 ప్రభాతవార్త మండలంలోని దిగువపల్లి పంచాయతీ శికారిపాళెం వద్ద సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈమేరకు మంగళవారం టిటిడి మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో తహశీల్దార్ హనుమంతు, ట్రాన్స్‌కో ఎఇఇ శశిధర్‌లు శికారిపాళెం వద్దగల స్థలాన్ని పరిశీలించారు. సూర్య కుసుమం పథకం ద్వారా 1మెగావాట్ విద్యుత్ తయారయ్యేందుకు అవసరమయ్యే దాదాపు 5ఎకరాలను 504సర్వేనంబర్‌లో గల ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. మండల సర్వేయర్ గుణశేఖర్, ట్రాన్స్‌కో సబ్ ఇంజనీర్ సంతోష్‌కుమార్, తేదేపా నాయకులు బోయకొండ సుబ్బు, సోమశేఖర్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం హుండీల ద్వారా 1.35 కోట్లు ఆదాయం

కాణిపాకం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.35 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. మంగళవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా 21 రోజులకు గాను హుండీల ద్వారా 1,34,68,278 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 44 గ్రాముల బంగారు, ఒక కిలో 5 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 9,687 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా 45,694 రూపాయలు ఆదాయంగా లభించింది. దీనితో పాటు 183 అమెరికా డాలర్లు, 20 ఆస్ట్రేలియా డాలర్లు, 355 యుఏఈ దినార్స్, 15 కెనడా డాలర్లు, 70 ఇంగ్లాండ్ ఫౌండ్స్, 25 యూరో కరెన్సీ, 37 మలేషియా రింగిట్స్ ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనుంజయ, ప్రసాద్, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి, హుండీ ఇన్స్‌పెక్టర్ సుబ్రమణ్యంనాయుడు, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

## కమిషనర్ ప్రభుత్వ అన్న క్యాంటీన్ పరిశీలన

పుంగనూరు, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త



పుంగనూరులో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ మంగళవారం స్థానిక పురపాలక సంస్థ కమిషనర్ మధుసూదన్ రెడ్డి తనిఖీ చేశారు. మొదట పరిసరాలను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ సిబ్బంది ప్రజలకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కమిషనర్ అక్కడ భోజనం చేసేవారిని రుచి ఎలా ఉందని అడగడంతో పాటు వారి సలహాలు సూచనలను తెలుసుకున్నారు.

## సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల సర్వే సమగ్రంగా చేయాలి

– కమిషనర్ మధుసూదన్ రెడ్డి



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త జరుగుతున్న సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల సర్వేను కమిషనర్ మధుసూదన్ రెడ్డి పరిశీలించారు. మంగళవారం పట్టణంలోని నాగపాళ్యంలో క్షేత్రస్థాయిలో సచివాలయాల ఉద్యోగులు చేస్తున్న సర్వేను పరిశీలించారు. సర్వే పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహ ఇలా అన్ని రకాల పరిశ్రమలను ఈ సర్వే పరిధిలోకి తీసుకురానున్నారు. వీటి ఆధారంగానే ప్రభుత్వం నిరుద్యోగులకు మరింత ఉపాధి కల్పించే అవకాశాలు ఉన్నాయన్నారు.

## ద్విచక్ర వాహనం కాల్చివేత

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త

పట్టణ పరిధిలోని రాంనగర్‌లో నరేష్ తన ద్విచక్ర వాహనాన్ని ఇంటిముందు నిలిపి నిద్రపోయారు. సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టారు. ద్విచక్ర వాహనం కాలిపోవడంతో బాధితుడు నరేష్ మంగళవారం ఉదయం 10 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఘటనపై పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

## సమస్య పరిష్కరించే వరకు సమ్మె విరమించం

తిరుపతి విద్య ఫిబ్రవరి 11 ప్రభాత వార్త



తమ న్యాయపరమైన సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం దారుణమని, సమస్య పరిష్కారమయ్యేవరకు సమ్మె విరమించే ప్రసక్తేలేదని వెటర్నరీ జూడాలు తేల్చిచెప్పారు. మంగళవారం వర్సిటీలో వెటర్నరీ వైద్యులు చేపట్టిన సమ్మె 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా గౌరవ వేతనం పెంచాలని రోడ్డున పడి గొంతెండిపోయేలా అరుస్తున్నా అధికారులలో చలనం లేకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మిగిలిన వైద్య విభాగాలలోని ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థులకు అందించే గౌరవవేతనాన్ని తమకు కేటాయించాలని డిమాండు చేశారు. రైతుల సంక్షేమానికి పాటు పడుతున్న వెటర్నరీ జూడాలకు ప్రభుత్వం తక్షణం గౌరవవేతనాన్ని పెంచి ఆదుకోవాలని కోరారు. ప్రతి నెలా ఖర్చుల కోసం ఈ స్థాయిలో ఉండికూడా తల్లిదండ్రులను ఆశ్రయించడం తమకే సిగ్గుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీ అధికారులు నిర్లక్ష్య వైఖరిని వీడి తక్షణం స్పందించాలని డిమాండు చేశారు. ్తతమకు అందరి వైద్య విద్యార్థులకు ప్రస్తుతం అందిస్తున్న స్టైఫండ్‌కు సమానంగా ఇచ్చేవరకు సమ్మెనుంచి వైదొలగేదిలేదని హెచ్చరించారు.

## భరత మాత ముద్దుబిడ్డ శ్రీ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి

పుత్తూరురూరల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:

భరత మాత ముద్దుబిడ్డ శ్రీ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భరత మాత ముద్దుబిడ్డ శ్రీ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి చిత్తూరు జిల్లా బీజేపీ కార్యదర్శి కోటకొండ బాబు నివాళులర్పించారు. కార్యక్రమంలో మేకల సుబ్రహ్మణ్యం, పుత్తూరు రూరల్ అధ్యక్షుడు చెన్నకేశవ, బూత్ ఇన్‌ఛార్జి సతీష్, గోపి, గోవిందరాజులు, శేఖర్, బీజేపీ కుటుంబ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## బేరివారి మండపం వద్ద నో ఎంట్రీ బోర్డులు

.శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో స్థానిక బేరివారి మండపం నుంచి విఎంసి సర్కిల్ వరకు ప్రతిరోజు ట్రాఫిక్ సమస్యతో జనం సతమతమవుతున్నారు. ఎప్పటినుంచో నో ఎంట్రీ ఉన్నా అమలు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బేరివారి మండపం నుంచి విఎంసి సర్కిల్ వరకు వెళ్ళాలంటే ద్విచక్రవాహనాదారులు, పలు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. పత్రికల్లో వార్తలు రావడంతో స్పందించిన డిఎస్పి నరసింహమూర్తి ఆధ్వర్యంలో సిఐ గోపి, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆపదసమయంలో అవసరాన్ని గుర్తించి సాయపడదాం



తిరుపతి(రవాణ), ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: అత్యవసర సమయంలో ప్రమాదాలు జరిగినపుడు రక్తం లభించక ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని, రక్తదానం చేస్తే మరికొందరికి సాయపడతుందని డిపిటిఓ జి.నరసింహులు తెలిపారు. రోడ్డుభద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి నరసింహులు వివిధ డిపోల నుండి వచ్చిన రక్తదాతలను అభినందించారు. రుయా ఆస్పత్రి వైద్యసిబ్బంది సహకారంతో రక్తదానశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా డిప్యూటీ సిటిఎం పి.విశ్వనాథం, తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ, సూపర్‌వైజర్లు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఆర్టీసి ఉద్యోగులు పాల్గొన్నారు.

## నేడు సద్యోముక్తి వ్రతం: భారీ ఏర్పాట్లు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబౌతుంది. ఈ నేపథ్యంలో బుధవారం పవిత్ర జీవనది స్వర్ణముఖి నదిలో సద్యోముక్తి వ్రతం, త్రిశూల స్నానాలు నిర్వహించటం ఆనవాయితి. త్రిశూల స్నానం తరువాత పంచమూర్తులను పట్టణంలో ఊరేగింపు జరపటం జరుగుతుంది. ఇది శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంకేతం అని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కొత్త ఇఓ బాపిరెడ్డి, కొత్త ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి సారథంలో కార్యక్రమాలకు ముస్తాబు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జలవినాయక ఆలయం ఎదురుగా నదిలో కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఎండా వాన వచ్చినా కూర్చొటానికి వీలుగా షెడ్డులను ఏర్పాటు చేసారు. అలాగే శాశ్వత చలమ ఏర్పాటు చేసారు. వంతెనపై నుంచి పరిశీలించటానికి వీలుగా ఏర్పాటు చేసారు. ఏర్పాట్లను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డిసూచనలతోఇఓటి.బాపిరెడ్డి, ఇఇ మురళీధర్‌రెడ్డిలు ఎక్కడా ఇబ్బంది లేకుండా పర్యవేక్షిస్తున్నారు.

## మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు భూఆక్రమణ

చిత్తూరు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు తమ భూములను ఆక్రమించుకోవడానికి తమపై దౌర్జన్యం చేస్తున్నారని పులిచెర్ల మండలం ఇ.రామిరెడ్డిగారిపల్లికి చెందిన సుబ్బిరామినాయుడు, కృష్ణకుమారిలు ఆరోపించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమకు తమ గ్రామంలో 4.75 ఎకరాల విస్తీర్ణం భూమి వుందని, తన కుమార్తె కృష్ణకుమారికి 5 ఎకరాల భూమి వుందన్నారు. ఈ భూముల్లో తాము 40 సంవత్సరాలుగా మామిడిచెట్లు పెంచి సాగు చేస్తున్నామన్నారు. అయితే ఇటీవల మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు కొంతమంది జెసిబిలను తీసుకువచ్చి మామిడి చెట్లకు కూల్చివేశారన్నారు. అలాగే సోమవారం రాత్రి తమ ఇంటికి నిప్పు అంటించారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో వారి నుండి తమకు ప్రాణహాని వుందని పోలీసు అధికారులను కలిసి తమను రక్షించడానికి రక్షణ కల్పించాలని కోరుతున్నట్లు వారు తెలిపారు.

## బలవంతపు భూసేకరణ చేయకండి

– సేజ్ సుడిగాలి పర్యటన



**సత్యవేడు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:** సత్యవేడు మండలంలో ఇరుగుళం, కొల్లడం పెద్ద ఈటిపాకం గ్రామ ప్రాంతాల్లో బలవంతపు భూసేకరణ ఆపి 2013 భూ సేకరణ చట్ట ప్రకారం భూ సేకరణ చేసి రైతులను వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మిక సంఘ రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వరులు డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా సత్యవేడు శ్రీసిటీ, సేజ్ పరిధిలో దాదాపు 114 ఎకరాలు పరిశ్రమల కోసమని భూమిని సేకరిస్తున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఇరుగుళం, కొల్లడం, పెద్ద ఈటిపాకం గ్రామాల్లో రైతు సంఘ నాయకులతోకలసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరులు పర్యటించి రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మీడియా సమావేశంలో వి.వెంకటేశ్వరులు మాట్లాడుతూ సత్యవేడు ఎస్ఈజెడ్ పరిధిలో ఇరుగుళం, కొల్లడం, పెద్ద ఈటిపాకం గ్రామాల్లో దాదాపు 144 ఎకరాల్లో పరిశ్రమల కోసమని భూ సేకరణ చేస్తున్నట్లునోటీసులు ఇచ్చి నెల రోజులు గడుస్తున్నప్పటికి, ఈ గ్రామాల్లో భూములు తీసుకుంటామని ప్రభుత్వం, గ్రామ సభలు పెట్టడం కాని వారికి పరిహారం ఇస్తామని చెప్పడం కాని, ఏమీ చేయకుండా ఆంగ్ల పత్రికల్లో న్యూస్ ఇచ్చి ఈ రోజు ఆ భూములను బలవంతంగా లాక్కోవడానికి పూనుకోవడాన్ని ఖండించారు. భూసేకరణ చట్టం ప్రకారం భూ సేకరణ చేసి ఈ మూడు గ్రామాల రైతులను వ్యవసాయ కూలీలను మెరుగైన ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లారైతు సంఘ అధ్యక్షుడు దాసరి జనార్ధన్, తిరుపతి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు మెలుగు రమేష్, సత్యవేడు మండల రైతు సంఘ నాయకులు మునస్వామి, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాలికల గురుకులానికి బ్లీచింగ్ వితరణ

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని కాసాతోటలోని బాలికల గురుకులానికి మంగళవారం బిటెక్ విద్యార్థి బ్లీచింగ్‌ను వితరణగా అందించారు. శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లు గ్రామానికి చెందిన బిటెక్ చదువుతున్న చుక్కల పవన్‌కుమార్ జన్మదిన పురస్కరించుకొని ఒక బస్తా బ్లీచింగ్ ను వితరణగా అందించారు. ఈ గురుకులంలో 7వ తరగతి అభ్యసిస్తున్న పవన్ సోదరి గీతిక చేతుల మీదుగా బ్లీచింగ్ బస్తాను ప్రిన్సిపల్ మాధవీలతకు అందించారు. ఉపాధ్యాయురాలు కోటీశ్వరి పాల్గొన్నారు.

## అబాకస్ పోటీల్లో ఎంజిఎం విద్యార్థిని ప్రతిభ

.తొట్టంబేడు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



తిరుపతిలో జోనల్ లెవల్‌లో విశ్వం ఎడ్యుటెక్ ఏ స్కిల్ కరికులం కంపెనీ నిర్వహించిన తిరుపతి జిల్లాలోని వివిధ ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో పోటీపడి స్టార్ జూనియర్స్ లెవల్ వన్‌లో అబాకస్‌లో పాల్గొన్న ఎంజిఎం స్కూల్ విద్యార్థికి తన ప్రతిభను చాటింది. ఈసందర్భంగా మొదటి ర్యాంకు సాధించిన ఎంజిఎం స్కూల్ విద్యార్థిని హనీషా విజయవాడలో రాష్ట్ర స్థాయి లెవల్ అబాకస్ పోటీల్లో ఫిబ్రవరి 9న తేదీన జరిగన స్టార్ జూనియర్ లెవల్-1లో అర్హత సాధించి సర్టిఫికెట్ మరియు మెమెంటోను అందుకుంది. ఈసందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో ఎంజిఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్య విద్యార్థిని అభినందించారు.

## రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం

.శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ మరియు క్లస్టర్ ఇన్‌ఛార్జి మరియు మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మిన్నల్‌రవిని మంగళవారం తిరుపతి పార్లమెంటు ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎం.సుబ్బయ్య ఆధ్వర్యంలో మరియు యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి సాయిశివారెడ్డిల ఆధ్వర్యంలో ఆయనచే కేక్ కట్‌చేయించి దుశ్శాలువతో సత్కరించి మెమెంటోను అందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా పేట బాలాజీరెడ్డి మరియు రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు సుబ్రమణ్యం(బుజ్జి) రాష్ట్ర బిసి విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్‌రావు, తొట్టంబేడు నాయకులు మణి, భాస్కర్, ముత్తరాశిపాళెం యువత ప్రసాద్, మునిచంద్ర, మునిబాబు, ప్రసాద్, సాయిహేమంత్, హర్ష కె.హరీష్, తదితరులు మరియు పట్టణ తెలుగుదేశంపార్టీ మహిళా ప్రధాన కార్యదర్శి దుర్గ, మరియు శాంతమ్మ, శ్రీదేవి, లక్ష్మమ్మ,, శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి సన్నిధిలో చిన్నారి కళాకారులకు గజ్జెపూజ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



శ్రీ శివజ్ఞ శివానీ నాట్యాలయం భరతనాట్య గురువు అరుణ ఆధ్వర్యంలో స్థానిక ముత్యాలమ్మ ఆలయంలో భరతనాట్యం నేర్చుకునే నాట్యకళాకారులకు అమ్మవారి సన్నిధిలో గజ్జెపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో చిన్నారి కళాకారులు అనన్య, మోక్షిత, సర్వాణి, మనస్వినిలకు గజ్జెపూజ నిర్వహించారు. ఈసందర్భంగా నాట్యాలయ గురువు అరుణ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని అందుకే విద్యార్థులకు చిన్నతనం నుంచే విద్యతో పాటు మన సంప్రదాయ కళలను నేర్పుకోవాలన్నారు. అందుకే తాను శివజ్ఞ శివానీ నాట్యాలయం ఆధ్వర్యంలో చిన్నారులకు కళలను నేర్పిస్తున్నానని తెలిపారు. అనంతరం ఆలయంలో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.

## మండలంలో భూఆక్రమణలపై కొరడా

–హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

.తొట్టంబేడు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



మండలంలో ఆక్రమణలకు చెక్‌పెట్టేందుకు తహశీల్దార్ మధుసూదనరావు కొరడా ఝుళిపిస్తున్నారు. ఈనేపద్యంలో గత నాలుగు రోజుల ముందు శివనాధపురంలో ఆక్రమణదారులు ముందు బోర్డులు ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈనేపద్యంలో మంగళవారం మండలంలోని శివనాధపాళెం రెవెన్యూ పరిధిలోని గ్రామ సర్వే నం.149/1 మరియు 149/2 సర్వే నంబర్లలో ఉన్న భూములు కార్యాలయ రికార్డుల మేరకు ప్రభుత్వ భూమిగా ఉండని తహశీల్దార్ మధుసూదనరావు తెలిపారు. దీంతో మంగళవారం శివనాధపురం గ్రామంలో ఉన్న ఆక్రమిత భూములను గుర్తించి వీఆర్ఓ గోపి ఆధ్వర్యంలోహెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గతంలో ఇక్కడ డిప్యుటీ తహశీల్దార్‌గా పనిచేసిన మధుసూదనరావు ప్రస్తుత తహశీల్దార్‌గా నియామకంతో ఆక్రమిత భూములపై దృష్టిసారించారు. డిప్యుటీ తహశీల్దార్‌గా ఉన్న సమయంలో రామచంద్రాపురం గ్రామంలో 90/1లో ఉన్న భూములకు సంబంధించి 11మందిని జైలుకు కూడా పంపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని ఆక్రమణలను అడ్డుకట్టవేస్తామని వివరించారు. మరికొందరు డికెటి భూములను ఆక్రమించుకుని వెంచర్లు వేసి విక్రయిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని అందుకే ఆక్రమణలపై దృష్టిసారించామన్నారు.

## బిందుసేద్యంతో సత్ఫలితాలు

తొట్టంబేడు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



రైతులు బిందు సేద్యంతో సత్ఫలితాలు సాధించవచ్చని గుంటూరు జిల్లా సూక్ష్మ సేద్య అధికారి డి.రమేష్ తెలిపారు. మంగళవారం క్షేత్రపర్యటనలో భాగంగా మండలంలోని శ్రీకృష్ణాపురం గ్రామంలోని వసంత మరియు కాళయ్య రైతుల పొలాలలో సూక్ష్మ సేద్య పథకం ద్వారా రాయితీపై అందించిన వ్యవసాయ పరికరాలు పనితీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సూక్ష్మసేద్య పరికరాలు ద్వారా వ్యవసాయం చేస్తే లాభాలు బాగుంటాయని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో సూక్ష్మ సేద్య ఇంజనీర్ సూక్ష్మ సేద్య ఇంజనీర్, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ రోడ్డు గురించి పట్టించుకోరా?

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పురపాలకసంఘం పరిధిలోని సాయిబాబా-శ్రీకృష్ణ మందిరం రోడ్డును గురించి ఇటు మున్సిపల్ అధికారులు కానీ అటు ఆర్‌అండ్‌బి అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ మార్గంలో మల్టిస్టోరేజ్ అపార్టుమెంట్లు వెలిసినాయి. శ్రీకాళహస్తి చెన్నై మార్గంలోని సాయిబాబా గుడి ఎదురుగా రోడ్డు ఉత్తరం వైపుకు వస్తుంది. ఈ మార్గంలో అపార్టుమెంట్లతో పాటు పెద్ద చర్చి, గిరిజన కాలనీ, శ్రీకృష్ణమందిరం, ప్రభుత్వాసుపత్రి, ఎస్‌డికె నగర్‌కు వెళ్ళు దారితో పాటు రెండు జూనియర్ కళాశాలలున్నాయి. అయితే గతంలో ఈ మార్గం చక్కగా బిటి రోడ్డు నిర్మించారు. రాకపోకలకు ఎంతో అనుకూలంగా ఉండేది. ముఖ్యంగా జూనియర్ కళాశాలు, ఎస్‌డికె నగర్‌లకు వెళ్ళు వాహనదారులకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. కానీ ఎందుకో ఈ రోడ్డు గురించి అధికారులకు పట్టదు. పాలకులకు తెలియదు. ఈ రోడ్డు ఎవరి పరిధిలో ఉందో కూడా ఎవ్వరికి తెలియదు. రోజూ వేలాది వాహనాలు నడుస్తాయి. అలాంటి రోడ్డు గురించి రెండు శాఖలు పట్టించుకోవటం లేదు. ఇక ఈ మార్గంలోని కాలనీ వాసులు తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమౌతున్నారు. ముఖ్యంగా చర్చికి సమీపంలో రోడ్డు పెద్ద గుంతలు ఏర్పడి అస్తవ్యస్తంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు

## సింహంలా సింగిల్‌గా వచ్చి గెలుపొంది సీఎంగా జగన్‌కి సాధ్యం

– మణి నాయుడు

బుచ్చినాయుడు కండ్రిగ, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో నూతనంగా సింహం లాగా సింగిల్‌గా వచ్చి వైసీపీ పార్టీ స్థాపించి సీఎం పదవిసాధించిన నాయకుడు, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమని వైసీపీ పార్టీ అధ్యక్షుడు మణినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాతవార్తతో మాట్లాడుతూ వైసీపీ పార్టీకోసం అందరూ కలసికట్టుగా పార్టీ కోసం పని చేద్దామని కోరారు. వైసీపీ పార్టీ పెద్దలు, నాయకులు నాపై నమ్మకంతో మండల పార్టీ కన్వీనర్‌గా అప్పగించారని, వారి నమ్మకాన్ని వంద శాతం బాధ్యతగా అందరిని నాయకులతో కలసి విబేధాలకు అవకాశం లేకుండా ఐక్యతగా పని చేద్దామని తెలిపారు. కూటమి ప్రభుత్వం కక్ష్య సాధింపులకు పాల్పడితే భయపడేది లేదని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో నూకతోటి రాజేష్ ఎమ్మెల్యేగా గెలిపించుకుని, రాష్ట్రానికి వైఎస్ జగన్‌ని ముఖ్యమంత్రి చేసే దిశగా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడు రవిరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు ఉగ్గుమూడి గురవయ్య(ఏఎంసీ ఛైర్మన్) దివ్యాంగుల అధ్యక్షుడు దేవదాస్‌రెడ్డి, సురుటుపల్లి మాజీ ట్రస్టు బోర్డు మెంబరు అజయ్‌రెడ్డి, హరినాథరెడ్డి, జిల్లా క్రియాశీలకసభ్యులు గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచ్ జి.గురవయ్య, సంజీవయ్య, వై.ప్రసాద్‌పాల్, కోటేశ్వరరావు, జయచంద్రనాయుడు, వెంకటేశ్వరులు, పరందమయ్య, తలారి వెట్టు సర్పంచ్ ప్రసాద్, సిద్ధేశ్వర్, చంద్ర, కార్యకర్తలు, నాయకులు, యూత్ నాయకులు, అభిమానులు, పాల్గొన్నారు.

## ఇంటర్ సెకండియర్ ప్రాక్టికల్స్‌కు 120 మంది గైర్హాజరు.

తిరుపతి విద్య, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త

సీనియర్ ఇంటర్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు సోమవారం నుంచి ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయి. ప్రతిరోజు ఉదయం మధ్యాహ్నం రెండు సెషన్స్ లలో నిర్వహించిన ప్రాక్టికల్స్ పరీక్షకు 120 మంది గైర్హాజరు అయ్యారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 94 పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన ప్రాక్టికల్స్ కు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు4861 మంది హాజరు అవ్వాల్సి ఉండగా వారిలో 81 మంది గైరుహాజరయ్యారు. మధ్యాహ్నం 94 పరీక్షా కేంద్రాల నిర్వహించిన ప్రాక్టికల్స్ కు 4319 మందికి గాను 39 మంది గైర్హాజరు అయినట్లు ఆర్ఐవో ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

## సేవాలాల్ జయంతి పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి విద్య, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద గిరిజన నవసమాజ్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం సంత్ శ్రీ సేవాలాల్ 288వ జయంతి మహోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీఎన్ఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్ నాయక్ మాట్లాడుతూ దేశంలో 15 కోట్ల బంజారాల ఆరాధ్య దైవం ఆధ్యా త్మిక గురువు సామాజిక క్రాంతి వీరుడు సేవాలాల్ మహారాజ్ అని కొనియాడారు. గత 25 సంవత్సరాలుగా సేవాలాల్ జయంతి ఉత్సవాలను అనంతపురం జిల్లా గుత్తి మండలం సేవాగడ్ నందు ప్రతి ఏడాది ఫిబ్రవరి 15న బంజారాల ప్రజలే నిర్వహి స్తున్నారన్నారు. . సేవాలాల్ జయంతిని కేంద్ర ప్రభుత్వం జాతీయ పండుగగా గుర్తించి సెలవు దినంగా ప్రకటించాలనీ డిమాండు చేశారు. మహోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం 2కోట్ల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీఎన్ఎస్ నాయకులు చంద్రశేఖర్ నాయక్, సునీల్ నాయక్, బాలు నాయక్, అడ్వకేట్ మాసుమయ్య, భార్గవ్ సాయి, సూర్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ విద్యార్థులను అభినందించిన వీసీ

తిరుపతి విద్య ఫిబ్రవరి 11 ప్రభాత వార్త



మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, జాతీయ సేవా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నర్సాపూర్ వేదికగా ఈనెల 3వతేదీ నుంచి ఏడు రోజుల పాటు జరిగిన జాతీయ సమైక్యతా శిబిరం సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి కాంటింజెంట్ లీడర్ డాక్టర్ అనిత, వాలంటీర్స్ రీతిక, లావణ్య కుమారి, ప్రోగ్రాం ఆఫీసర్లు మాధవి, స్వాతి హాజరయ్యారు. ఏడు రోజుల పాటు ఎన్నో నైపుణాలను ప్రదర్శించి, సేవా ధృక్పథాన్ని, మానవా దృక్పథంపై పలు అంశాలను ఒడిసిపట్టారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజిని, అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను అధికారులను అభినందించారు.

## ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందేందుకు

ఈ నెల 28 ఆఖరి తేదీ

కేవీబీ పురం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:

ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందేందుకు నమోదుకు ఈ నెల 28 తేదీ లోపు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. మండల కేంద్రమైన కేవీబీ పురంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద మంగళవారం ఆర్‌బీకేలో పని చేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌తో మండల వ్యవసాయ అధికారి ఉత్పత్తుల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రతి రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లోరైతు నమోదు కార్యక్రమం 10 తేదీ నుంచి చేపట్టడం జరుగుతుందన్నారు. దీని కొరకు ప్రతి రైతు వెంటనే రైతు సేవా కేంద్రం(ఆర్ఎస్‌కే) వద్దకు వెళ్లి మీ పేరు, ఊరు, ఆధార్ నంబరు, పట్టాదారు పాస్‌బుకు, ఆధార్‌కు లింకైన ఫోన్ నెంబరు వివరాలను అందించాలన్నారు. నమోదు ప్రక్రియ పూర్తయ్యాక మీరు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందుతారన్నారు. ఆర్ఎస్‌కేకి వెళ్ళలేకపోతే మీ గ్రామంలోని విలేజ్ అసిస్టెంట్లు లేకుంటే సంబంధిత ఫోన్ చేసి వివరాలు తెలిపితే ఓటీపీ ద్వారా మీ నమోదు పూర్తి చేసుకోవచ్చున్నారు. రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య లేకపోతే మీరు ఈ పథకాలకు అర్హులు కాదన్నారు.

## మహా కుంభమేళా యాత్రకు ఆర్టీసిచే బస్సు సౌకర్యం

తిరుపతి క్రీడ, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త

మహా కుంభమేళా ప్రయాగరాజ్, ఉత్తరప్రదేశ్ (గంగ, యమున, సరస్వతి నదుల త్రివేణీ సంగమం) సందర్భంగా తిరుపతి నుండి ఏసీ మల్టీఆక్సిల్ వోల్వో ఏసీ బస్సు (45 సీటర్) ప్యాకేజీ టూర్ ను తిరుపతి నుండి ఏర్పాటు చేయడం జరిగిందని డివిజనల్ మేనేజర్ శ్రీనివాస రావు తెలియజేసారు. ఈ బస్సు తిరుపతి నుండి బస్సు ఈ నెల 11వ తేది ఉదయం 5 గంటలకు బయలుదేరి, 18వ తేది సాయంత్రం 5 గంటలకు తిరుగు ప్రయాణం, ఒకరికి పెద్దలకు రూ. 22000, పిల్లలకు: 19000 (3 నుండి 10 సం) వరకు (రవాణా చార్జీలు ఏసీ, ఫ్రెష్ అప్, గైడ్ సౌకర్యంతో కలిపి), ఒంటిమిట్ట, బాసర, జబల్పూర్ లోకల్ సైట్ సీయింగ్, చిత్రకూట్ లోకల్ సైట్ సీయింగ్, ప్రయగరాజ్ స్నానం, వారణాసి లోకల్ సైట్ సీయింగ్, నాగపూర్ లోకల్ సైట్ సీయింగ్. ధర్మపురి, మహానంది ప్రదేశాలు చూపబడుతుందన్నారు. బస్సు శ్రీనివాసం (టీటీడీ), బయలుదేరుతుందని తెలిపారు. ఇతర వివరాలకు 9848850099, 9848973985, 9848802099 08772289123, 9848007033 సంప్రదిం చాలని తెలిపారు.

# తిరుపతి డివిజన్

## వార్తకు స్పందన..

### ఎట్టకేలకు తాగునీటి చేతి బోరుల మరమ్మతులు



పాకాల, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త

పాకాల మండలం ఉప్పరపల్లె పంచాయతీ ఊట్లవారిపల్లె గ్రామంలో చాలా కాలంగా పని చేయకుండా ఉన్నటువంటి మూడు మంచి నీటి చేతి బోరు పంపులపై వార్తా పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించిన అధికార యంత్రాంగం. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, డిఈ ఉన్నతాధికారులు సహాయంతో మంగళవారం రోజున గ్రామంలోని మూడు మంచి నీటి చేతి బోరు పంపులకు మరమ్మతులు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం, అధికారులు సత్వరం స్పందించిన తీరుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## భూపతీశ్వర ఆలయంలో పిచ్చి మొక్కలు తొలగింపు

సత్యవేడు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:



సత్యవేడు పట్టణం మఠం వద్ద శ్రీ భూపతీశ్వర ఆలయ ప్రాంగణంలో విస్తారంగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. పిచ్చి మొక్కలతో ఆలయ ప్రాంగణం నిండిపోవడంతో కొందరు ముదిరాజ్ కులస్తులు సమాచారాన్ని మండల ముదిరాజ్ సేవా సంఘం అధ్యక్షుడు మురళి(చికెన్ చిన్న) దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే స్పందించి మంగళవారం తమ సొంత నిధులతో జేసీబీ వాహనం ద్వారా ఆలయ ప్రాంగణంలోని పిచ్చి మొక్కలను తొలగించడంతో శ్రీ భూపతీశ్వర ఆలయ ప్రాంగణం పూర్తిగా పరిశుభ్రతనెలకొంది. ముదిరాజ్ సేవా సంఘం అధ్యక్షులుగా మురళి బాధ్యతలు స్వీకరించిన తరువాత అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ, ఉచిత కంటి వైద్య శిబిరాలు, ఆలయ ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు తొలగింపు వాటి పనులు చేపట్టి సేవా నిరతి చాటడం పట్ల స్థానిక ముదిరాజ్ సేవా సంఘం సభ్యులు పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బృందావనాలను వినియోగంలోకి తీసుకురావాలి

– డివిజనల్ అధికారి రవీంద్రబాబు

సత్యవేడు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:



సత్యవేడు మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఫిబ్రవరి 15 లోపు వినియోగంలోకి తీసుకురావాలని సూళ్లూరుపేట డీఎల్‌పీవో రవీంద్రబాబు కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో చంద్రశేఖర్, పంచాయతీరాజ్ విస్తరణాధికారి తరుణాక్ష రెడ్డితో కలసి వా నెల్లూరు, పెద్ద ఈటిపాకం, చిన్న ఈటిపాకం, సత్యవేడు తదితర ప్రాంతాల్లో బృందావనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో రవీంద్రబాబు మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీకేంద్రాలను మళ్లీ వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకున్నామన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి బృందావనాల ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేయాల్సి ఉందన్నారు. అయితే ఈ చెత్త సేకరణ, తరలింపుకు సంబంధించి పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ వేతనాలు 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. అలాగే మండలంలో ప్రతినెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. దీంతో పాటు పంచాయతీ సెక్రటరీ ప్రతిరోజు చేసే పనులకు సంబంధించి పీఆర్ వన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. చెరివి, మల్లవారి పాళెం తూర్పు పడమర, ఆరూరు తదితర పంచాయతీల్లో బృందావనాలు నిర్మించడానికి అవసరమైన స్థలం కోసం రెవెన్యూ అధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో సత్యవేడు పంచాయతీ సెక్రటరీ ముని రవికుమార్, జలజశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రికి పార్కింగ్‌లు ఖరారు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే యాత్రికులు, భక్తుల వాహనాల పార్కింగ్‌కు సంబంధించి పోలీసులు, ఆలయాధికారులు ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు పలు పార్కింగ్ స్థలాలను ఎంపిక చేసారు. ఈమేరకు అర్బన్ సిఐ డి.గోపి, ఆలయ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన కిషోర్‌లు స్వర్ణముఖి నది ఒడ్డున ఈ ఏడాది కొత్తగా పార్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి అందించిన సమాచారం మేరకు.. వాహనాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎపిసీడ్స్ కార్పొరేషన్ ఆవరణలో బస్సులు, మినీ బస్సులు పార్కింగ్ చేయాలి. అలాగే మార్కెటింగ్ కమిటి ఆవరణలో కార్లు పార్కింగ్‌కు ఏర్పాటు చేసారు. పూలతోటలోనూ, స్వర్ణముఖి నది ఒడ్డున ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేయుటకు నిర్ణయించినట్లు తెలిపారు. ఇక జలవినాయకుని ఆలయం సమీపంలో ఉన్న గతంలో ధూర్జటి కళాప్రాంగణాన్ని ఏర్పాటు చేసే చోట విఐపిల వాహనాల పార్కింగ్‌ను ఖరారుచేసినట్లు ఇఓ తెలిపారు.

## గుడిమల్లంలో రోడ్డు నిర్మాణానికి సహకరించండి: ఎంఎల్ఏ

సిఎం వచ్చే అవకాశం:

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని మరో చారిత్రాత్మక శైవ క్షేత్రం గుడిమల్లం అని, ఈ ఏడాది మహాశివరాత్రిని ఇక్కడ ఘనంగా నిర్వహించుటకు సన్నాహాలు జరుగుతున్నాయని జిల్లా అధికారులు స్పందించి పాపానాయుడుపేట నుంచి గుడిమల్లం వరకు కొత్త రోడ్డు నిర్మించి సహాకరించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. కనీసం రూ.3కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరునికి పట్టు వస్త్రాలను ఈ నెల 25 మధ్యాహ్నం 4.30 గంటలకు అందించేటట్లు సమాచారం అందిందని సుధీర్‌రెడ్డి వివరించారు. శ్రీకాళహస్తీశ్వరునికి పట్టు వస్త్రాలు ప్రభుత్వ లాంఛనాలతో అందించిన తరువాత ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు బహుశా గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరుని దర్శనానికి వచ్చే అవకాశం ఉండవచ్చునని సుధీర్‌రెడ్డి వివరించారు. కాబట్టి రోడ్లను బాగు చేయాలని కోరినట్లు తెలిపారు.

## జేఈఈ మెయిన్స్ ఫలితాలలో నారాయణ ప్రభంజనం

తిరుపతి విద్య ఫిబ్రవరి 11 ప్రభాత వార్త

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన జెఇఇమెయిన్ (జనవరి 2025) ఫలితాలలో తమ విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్స్ సాధించాలని డి.జి.యం కొండలరావు తెలిపారు. ఎం భానుచరణ్ రెడ్డి 99.99, మణిదీప్ రెడ్డి 99.98, నిఖిల్ 99.98, ధనుష్ 99.97, కార్తీక్ 99.93, యశ్విత 99.90 పర్సంటైల్స్ సాధించారని, 99.9 పర్సంటైల్స్ పైన ఆరుగురు, 99 పర్సంటైల్స్ పైన సుమారు 30 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. ఈ విజయానికి కారణమైన అధ్యాపకులకు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## శాస్త్రీయ పద్ధతుల పెంపకంతోనే అధిక ఆదాయం

తిరుపతి విద్య ఫిబ్రవరి 11 ప్రభాత వార్త



రైతులు శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించి సీమపందుల పెంపకాన్ని చేపటడంతో అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని పరిశోధన సంచాలకులు శ్రీలత, విస్తరణ సంచాలకులు డాక్టర్ శోభామణి అభిప్రాయపడ్డారు. ఎస్వీ వెటర్నరీ వర్సిటీ నిరంతర పుశువైద్య, సమాచార కేంద్రం ఆధ్వర్యంలో సీమపందుల పెంపకం, గ్రామీణ వ్యవస్థాపకత అనే అంశంపై ఐదురోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రసంగిస్తూ గ్రామీణ నిరుద్యోగాన్ని నిర్మూలించడమే వర్సిటీ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా రైతులకు శాస్త్రీయ పద్ధతులలో కోళ్ల పెంపకం, సీమపందుల పెంపకంపై క్రమంతప్పకుండా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ సుజాత, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, గంగరాజు, మంజరి, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ కు చెందిన రైతులు హాజరయ్యారు.

## తెలుగు గంగ నీళ్లు విడుదల రైతులు హర్షం



కోట,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : కోట మండలం కేశవరం గ్రామ రైతులు చివరి దశలో ఉన్న పంటలు ఎండి పోతునాయని గంగ జాలాలను విడుదల చేసి పంటలను కాపాడాలని ఆగ్రామస్తులు తెలుగు గంగ ఇంజినీర్లును కోరారు. ఆమేరకు కోట మండల ఎఇ నిరంజన్ కూమార్ పై స్దాయి ఇంజినీర్ అధికారులతో మాట్లాడి మంగళవారం మెజర్ బ్రాంచి కాలువుకు నీళ్ల విడుదల చేయించారు. దీంతో కేశవరం గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలుగుగంగ ఇంజినీర్లుకు కృతజ్ఞతులు తెలిపారు.

## రైలు ఢీకొని ఉద్యోగి మృతి-ఒకరికి గాయాలు

తడ, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : తడ మండలం అనుపగుంట రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం రైలు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో డ్యూటీలో ఉన్న ఇద్దరు రైల్వే గ్యాంగ్ మెన్లలను చెన్నై వైపు వెళ్లుతున్న రైలు ఢీ కొట్టింది. దీంతో కేరళ వాసి అభిషరేక్ (30) అక్కడిక్కడే మృతి చెందారు.కాలు తొడ భాగం విరిగి తీవ్రగాయాల పాలైన బీహార్ వాసి ముంజయ్ కుమార్ (32)ను స్థానికులు 108 వాహనం ద్వారా సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం చెన్నై రైల్వే ఆసుపత్రికి తరలిస్తున్నట్లు సహచర ఉద్యోగస్తులు తెలిపారు.

## మత్స్యకారుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



బాలాయపల్లి, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త మత్స్యకారుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వాలు లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మండలంలోని కయ్యూరు చెరువులో 1 లక్ష 93 వేల చేప పిల్లలను వెంకటగిరి శాసనసభ్యులు వదిలారు.

ముందుగా గంగమ్మ తల్లికి పసుపు, కుంకుమ, కొబ్బరికాలతో పూజలు నిర్వహించారు. మత్స్యకారుల అభివృద్ధికి కూటమీ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.డి డి ఓ నాగరాజు మాట్లాడుతూ కుప్పం పల్లి సొసైటీ కోరిక మేరకు 2024 –25 సంవత్సరాలకు పిఎంఎంఎస్వై పథకం ద్వారా 60 శాతం సబ్సిడీతో 55 లక్షల రూపాయల చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. కట్ల, గండి, మెరిగిరి రకాల చేప పిల్లలను వదిలారు. ముందుగా సొసైటీ వారు, టీడీపీ నేతలు ముందుగా ఎమ్మెల్యే రామకృష్ణకు శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. మత్స్యకారుల అభివృద్ధికై సబీసీడీ పై చేపపిల్లలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ ఏడి జి రాజేష్, ఎఫ్డిఓ డి. మధుసూదన రావు, వి ఎఫ్ ఏ వరప్రసాద్, ఎంపీడీవో డీజే వినీల్ కుమార్, డి ఈ సుధాకర రెడ్డి, ఏ.ఈ. శివప్రసాద్, ఈవోపీఆర్డి మోహన రాజు, కయ్యూరు చెరువు నీటి సంఘం అధ్యక్షులు రావి మస్తాన్ నాయుడు, టిడిపి నేతలు రావి సత్యం నాయుడు, మల్లెమాల గోపి కృష్ణారెడ్డి, సీవికే నాయుడు, చంద్ర శేఖర్ నాయుడు, వెంకట రమణయ్య నాయుడు, జడపల్లి కోటేశ్వర గౌడ్, దాసరి చిన్న కోటేశ్వరరావు, దామ మధు నాయుడు, చిత్తూరు ఈశ్వరయ్య, వెంకటాద్రి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## రైతులకు ఆదాని ఫౌండేషన్‌చే వ్యవసాయ పరికరాలను పంపిణీ



గూడూరు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: ప్రాజెక్ట్ ప్రభావిత సమీప గ్రామాల స్థానిక రైతులకు సాధికారత కల్పించే ప్రయత్నంలో, అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ (ఎకెపిఎల్) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) జగదీష్ పటేల్ రైతు స్నేహ బందనం కార్యక్రమంలో కృష్ణపట్నం ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌తో అనుబంధించబడిన రైతులకు ట్రాక్టర్, ఇరిక్షా మోటారు చేయబడిన పురుగుమందుల స్ప్రేయర్లు వంటి వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. ఎకెపిఎల్ యొక్క కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద అదానీ ఫౌండేషన్ వ్యవసాయ ఇన్పుట్ ఖర్చును తగ్గించడం, భూమి యొక్క యూనిట్ ప్రాంతానికి పంట ఉత్పత్తిని పెంచడం ద్వారా ఆర్థిక మరియు సామాజిక రంగంలో రైతులకు సాధికారత కల్పించడానికి రీనీదిశిలి ప్రోత్సహించిందని గుర్తు చేసుకోవచ్చు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన తరువాత సిఇఒ మాట్లాడుతూ, ఎకెపిఎల్ తన సిఎస్ఆర్ విభాగం అదానీ ఫౌండేషన్ ద్వారా రైతులకు సాధికారత కల్పించడానికి కట్టుబడి ఉంది, దీని కోసం రైతులకు వ్యవసాయ భూముల ఉత్పాదకతను పెంచడానికి వివిధ వ్యవసాయ పద్ధతులను అందిస్తున్నారు. సీఎస్ఆర్ ప్రాజెక్ట్ ద్వారా సీఎస్ఆర్ హెడ్ రాజేష్ రంజన్ మాట్లాడుతూ, వేరుశెనగ విత్తనాలు, జిప్సం, మోటారు స్ప్రేయర్లు, హార్టికల్చర్ ప్లాంట్లు మొదలైన వాటికి అదానీ ఫౌండేషన్ వ్యవసాయ ఇన్పుట్ మద్దతును అందిస్తోందని అన్నారు. కెఎఫ్‌పిసిఎల్‌తో అనుబంధం ఉన్న రైతులకు, ముఖ్యంగా తమ్మిణపట్నం, గుమ్మలదిబ్బ కొత్తూరు, గుమ్మలదిబ్బ పాత్తూరు, లింగవరం, బల్లవోలు, యెరూరు, వరగలి వంటి పరిధీయ గ్రామాల రైతులకు గుమ్మల్దిబ్బా, తమ్మిణపట్నం, బల్లవోలు, యెరూరు, నరికేలపల్లిలకు చెందిన 30 మంది రైతులకు సీఈవోఏకెపిఎల్ చేతుల్లో మోటారు స్ప్రేయర్లు అందుకున్నారు. గుమ్మల్దిబా కొత్తూరు గ్రామానికి చెందిన 10 మంది మహిళల బృందం పోలేరామా తల్లి ఉమెన్స్ గ్రూప్ 9 ఫిబ్రవరి 2025న సహజ పురుగుమందుల తయారీ వేప ద్రావణం శిక్షణను పూర్తి చేసింది. ఈ కార్యక్రమంలో, సిఇఒ జగదీష్ పటేల్ వంటగది వ్యర్థాల సేకరణ మార్కెటింగ్ సుగంధ ద్రవ్యాల అమ్మకం కోసం ఇరిక్షాను పొలేరమ్మ తల్లి ఉమెన్స్ గ్రూప్కు అందజేశారు. కార్పొరేట్ వ్యవహారాల విభాగం అధిపతి మృత్యుంజయ్ రామ్, హెచ్ఆర్ అడ్మిన్ విభాగం అధిపతి అనురాగ్ ద్వివేది, సెక్యూరిటీ విభాగం అధిపతి మేజర్ వెంకటేష్ భాస్కర్, జెడ్పీహెచ్ఎస్ కృష్ణపట్నం ఈ కార్యక్రమంలో హెడ్ మిస్ట్రెస్ పి.సరళ, ఎడ్యుకేటర్ డి.రాధికా ఇతరులు పాల్గొన్నారు. ఎన్ సుబ్రమణ్యం, సర్పంచ్ తమ్మిన్నపట్నం గ్రామ పంచాయతీ, కొలంగిరి శ్రీనివాసులు, పెడా కాపు, వావిల పొలైయా, నదిపి కాపు, కారి పొలైయా, గుమ్మలదిబ్బ కొతురుకు చెందిన చిన్న కాపు, రామదాసు, పెద్ద కాపు, నరసింహులు, నదిపి కాపు, మస్తానయ్య, గుమ్మలదిబ్బ పాథూరుకు చెందిన చిన్న కాపు అదానీ ఫౌండేషన్ చేస్తున్న మంచి సామాజిక అభివృద్ధి పనులను ప్రశంసించారు. మిస్టర్ సిహెచ్. ఈ కార్యక్రమానికి కెఎఫ్‌పిసి ఎల్‌సిఇఒ వెంకటేశ్వర్లు వ్యాఖ్యాతగా వ్యవహరించగా, కె ఎఫ్‌పిసిఎల్‌కి చెందిన షేక్ షఫీ, డాక్టర్ సిహెచ్ రమేష్ బాబు, టి రవీంద్ర, అరుణ్, షేక్ షాహుల్ హమీద్, పి. మురళి, కె రమేష్ బాబు, అదానీ ఫౌండేషన్కు చెందిన మొలకమ్మ ఎకెపిఎల్ మేనేజ్మెంట్ సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## చిన్నారులందరికీ ఆధార్ కార్డులు



వెంకటగిరి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : 0 నుండి 6 సంవత్సరాల వయసు లోపల ఉన్న వారందరికీ ఆధార్ కార్డు ఇప్పిస్తున్నట్లు డి.ఎల్.డి.ఓ సుశీల తెలిపారు. వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయంలో మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. సచివాలయ పోలీసులు, అంగన్వాడీ సిబ్బంది ద్వారా ఆధార్ కార్డులు ఇప్పించే ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక ఆధార్ క్యాంపులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో కేవీ కోటేశ్వరరావు, సిడిపిఓ శంషాద్ బేగం తదితరులు పాల్గొన్నారు.

## విశిష్ట గుర్తింపు ఉంటేనే రైతుకు ప్రభుత్వ పథకాలు

తడ, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : రాష్ట్రప్రభుత్వం ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇచ్చేందుకు నిర్ణయించింది. జిల్లాస్థాయి వ్యవసాయ శాఖ అధికారులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఈ విశిష్ట సంఖ్యను ఇస్తున్నారు. ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతు నమోదు కార్యక్రమం మొదలయింది. మంగళవారం ఇందులో భాగంగా తడ మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉన్నారు. రైతులు తమ పేరు, ఊరు, ఆధార్ నంబర్, పట్టాదార్ పాస్‌బుక్‌తో పాటు ఆధార్‌కి లింకయిన ఫోన్ నంబర్ వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకులకు అందించాల్సి ఉంది. నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత వీరు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందుతారు. ఒకవేళ సేవా కేంద్రాలకు వెళ్లలేకపోతే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వివరాలు చెప్పి ఓటిపి ద్వారా విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవచ్చు. ఈ విశిష్ట గుర్తింపు రైతు డిజిటల్ గుర్తింపు కార్డుగా రైతన్నలకు ఎంతో ఉపయోగపడనుంది. ముఖ్యంగా పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, పంట నష్టం పరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీలు వంటివి పొందాలంటే ఈ గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా అవసరమై ఉన్నట్లు చెప్పారు. ఈ సంఖ్యను రైతులు తమ ఫోన్లలో భద్రపరుచుకోవాలని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు.

## దుకాణాలకు ఏర్పాటుకు వేలం పాటలు



చిల్లకూరు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : మండల పరిధిలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలిసిన ఈ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం ఆలయ అధికారులు జాతర అయిన తర్వాత నుండి సంవత్సరం కాల పరిమితితో దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు వేలం పాటలు నిర్వహించారు. టెంకాయలు పూజా ద్రవ్యములు 15 లక్షల 65 వేల రూపాయలు, కొబ్బరి చెక్కలు సేకరించినందుకు రు.3,20,000 లు, అమ్మవారి ఫోటోలు డాలర్లు అమ్ముకునేందుకు రు.3,39,000లు, దేవస్థానం వద్ద క్లాత్ పందిళ్లు హైలెట్స్‌కి రెండు లక్షలు, గుడిపై కోడి పిల్లలు సేకరించినందుకు రు.35 వేలు, పాదరక్షలు రు.16వేలకు వేలం జరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రు. 8,80,000 దేవస్థానం ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో నవీన్ కుమార్, చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అదృశ్యమైన బాలికలను అప్పగించిన పోలీసులు



గూడూరు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : గూడూరు జానకిరామ్‌పేటలో ఉన్న ప్రభుత్వ గిరిజన హాస్టల్ నుండి అదృశ్యమైన ఇద్దరు బాలికలను దక్కిలి మండలం శ్రీపురంలో వారి బంధువుల ఇంట ఉన్నారని గుర్తించి బాలికలను వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని గూడూరు డీఎస్పి గీతా వెల్లడించారు. గూడూరు పట్టణంలోని సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ గీత మాట్లాడుతూ జానకిరామ్ పేటలో ఉన్న ప్రభుత్వ గిరిజన పాఠశాల మరియు హాస్టల్లో పదవ తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు సోమవారం మధ్యాహ్నం నుండి కనిపించలేదని సాయంత్రం అధ్యాపకులు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. వెంటనే పలు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి అర్ధరాత్రి దక్కిలి మండలం శ్రీపురంలో వారి బంధువుల ఇంటి వద్ద ఉన్నారని గుర్తించడం జరిగిందని వెల్లడించారు. బాలికలతో మాట్లాడగా త్వరలో పరీక్షలు ఉన్నాయని ఆ పరీక్షల్లో ఫెయిల్ అవుతామ అన్న భయంతో మానసిక ఒత్తిడితో పాఠశాల ప్రహరీ గోడ దూకి వెళ్లి పోయామని తెలియజేశారని బాలికలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించామని కేసును చాలెంజ్గా తీసుకొని పలు బృందాలను ఏర్పాటు చేసి కొన్ని గంటల్లోనే బాలికలను గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టూ టౌన్ సీఐ శ్రీనివాసులు ఎస్ఐ సుబ్రహ్మణ్యం రాజు, సిబ్బంది పాల్గొన్నారు. నెల్లూరు పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ ప్రాంతానికి చెందిన తిరుమల శెట్టి చందన, సైదాపురం మండలం వేముల చేడు గ్రామానికి చెందిన మోపూరు జయశ్రీలు హాస్టల్ ప్రహరీ గోడ దూకి వెళ్లిపోయారు.

## సిపిడబ్ల్యూ స్కీం కింద నిధులు మంజూరు : ఎమ్మెల్యే



గూడూరు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : నియోజకవర్గ పరిధిలో సిపిడబ్ల్యూ స్కీం కింద మంచి నీటి సరఫరా పథకాలకు, విద్యుత్ ఛార్జిల నిర్వహణ కొరకు 4 కోట్ల 81 లక్షల 20 వేల రూపాయలు నిధులు మంజూరు చేసిన ముఖ్య మంత్రికి శాసన సభ్యులు, పాశిం సునీల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. చిట్టమూరు మండలం కోగిలి 22 ఇతర ఆవాసములకు 67 లక్షలు, గుణపాటి పాలెం 22 ఇతర ఆవాసములకు 69 లక్షలు, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్, బోర్ వెల్ కొరకు 11.20 లక్షలు, మెట్టు 4 ఇతర ఆవాసములకు 37 లక్షలు కోట మండలం గూడలి, ఇతర ఆవాసములకు 84 లక్షలు కోట 16 ఇతర ఆవాసములకు 1 కోటి 8 లక్షలు, చిల్లకూరు మండలం వరగలి గ్రామం ఎస్టి కాలనీ కొరకు మోటార్ పైప్ లైన్ కొరకు 20 లక్షలు, గూడూరు మండలం మిట్ట ఆత్మకూరు, ఇతర ఆవాసములకు 85 లక్షలు, గత ప్రభుత్వంలో నియోజకవర్గ పరిధిలో ఒక్క అభివృద్ధి పని జరగలేదు.

## ప్రతి రైతుకు గుర్తింపు నంబర్ ఏవో



బాలాయపల్లి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధ్వర్యంలో సంయుక్తంగా రాష్ట్రంలోని ప్రతి రైతుకు ఒక విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తుందని వ్యవసాయ శాఖాధికారిని పి.శిరీష తెలిపారు. ఆధార్, పట్టాదారు పాస్ బుక్కు, ఫోన్ నెంబర్ వివరాలతో రైతు సేవా కేంద్రంలో రైతు డిజిటల్ గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రైతు డిజిటల్ గుర్తింపు కార్డు కోసం ఈ నెల 28 లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## రామదాసు మృతికి నేతల సంతాపం



వెంకటగిరి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : మాజీ జడ్పిటిసి సీనియర్ న్యాయవాది బీరం రామదాసు కన్నుమూశారు. రామదాసు మృతి తీరనిలోటు అని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతా మోహన్ సంతాపం తెలిపారు. ఆయన జడ్పిటిసిగా పేదలకు ఎన్నో సేవలు చేశారని తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మాజీ ఏఎంసిచైర్మన్ రాజేశ్వర రావు, న్యాయవాదులు లక్కమనేని కోటేశ్వరరావు, బాబ్జి తదితరులు సంతాపం తెలిపారు.

## వ్యక్తిపై దాడి తీవ్ర గాయాలు



బాలాయపల్లి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : మేల్చూరు గ్రామానికి చెందిన చింతల శివరాం ప్రసాద్, అతని భార్యపై దాడి జరిగింది. మంగళవారం తమ ఇంటి వద్ద ఉన్న చింతల శివరాం ప్రసాద్‌పై అదే గ్రామానికి చెందిన కాసరం వెంకట్ రాజేష్, పాత కక్షలు పెట్టుకొని తన కారులో మరో ముగ్గురు వ్యక్తులను వెంటబెట్టుకొచ్చి కర్రలతో దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అడ్డువచ్చిన తన భార్య ధనలక్ష్మిపై కూడా, దాడి చేసి బట్టలు చించి వేశారు. దాడిలో తలకు బలమైన గాయం కావడంతో శివరాం ప్రసాద్‌ని భార్య వెంటబెట్టుకుని వచ్చి వెంకటగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి చేరారు. శివరాం ప్రసాద్ కుటుంబం అనుభవంలో ఉన్న ఇంటి స్థలాన్ని కాజేయడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తులను నిలువరించి, దాడి చేసిన వీరిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి వివి రమణయ్య డిమాండ్ చేశారు.

## జగన్ 2.0 కాదు, 420 నియోజకవర్గం



గూడూరు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : జగన్ 2.0 కాదు 420 అని నియోజకవర్గం అని చిరంజీవి యువత అధ్యక్షులు, జనసేన నాయకులు నయీం ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో వేలకోట్ల మైనింగ్ మాఫియా జరిగిందని అనేక రకాల అవినీతికి పాల్పడ్డారని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనయించారన్నారు. ఇప్పుడు నేను 2.0 స్టార్ట్ చేస్తానని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జనసేన నేత పవన్ కళ్యాణ్ జోలికి కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జోలికి కానీ అలాగే గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ జోలికి వస్తే ఊరుకునేది లేదని ప్రజలు జగన్మోహన్ రెడ్డికి తగిన బుద్ధి చెప్తారని ఆయన అన్నారు.

## స్టెమీతో గుండెకు భరోసా

కోట,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : కోట కమ్యూనిటి హెల్త్ సెంటలో మంగళవారం గుండె వ్యాధిలపై మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రూప అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గుండె పోటు లక్షణాలు ఉన్న వారు మొదట గంటలోని సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వేళ్లితే మెరుగునై వైద్యం అందిస్తారని చెప్పారు, ప్రస్తుతం అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా ఈ స్టెమీ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా గుర్తింపు పోందిన ఆసుపత్రిలో గుండె కు సంబంధిచిన సేవలను పొంద వచ్చున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, డాక్టర్, దోమ ప్రియారావు, రాజశేఖర్, మాధురి తదతరులు పాల్గొన్నారు.

## వైష్ణవీదేవిని తాకిన భాస్కరుడి కిరణాలు



చౌడేపల్లి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : పుదిపట్ల వైష్ణవీదేవి ఆలయంలో విశేషం చోటు చేసుకొంది. అమ్మవారిని ప్రధానార్చకురాలు శ్రావణి యదా ప్రకారం విశేషాలంకరణ గావించారు. అనంతరం సూర్య కిరణాలు అమ్మవారి కుడినేత్రంపై ప్రసరించాయి. దీంతో భక్తులు వైష్ణవీదేవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణదాత వినోద్‌కుమార్‌రెడ్డి భక్తులకు తీర్థ ప్రసాదాలందించారు.

వార్త ప్రభావం

## కుప్పం ఎస్సైలుగా బాబు..రామకృష్ణల నియామకం

కుప్పం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : కుప్పం అర్బన్ పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైలుగా బాబు, రామకృష్ణలను నియమిస్తూ జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 8న 'వార్త'లో ఇటు సిబ్బంది కొరత–అటు వరుస చోరీలు అనే కథనంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. వి.కోట ఎస్సైగా ఉన్న కె. బాబు, చిత్తూరు రోడ్‌సేఫ్టీ విభాగం ఎస్సైగా ఉన్న వై. రామకృష్ణలను కుప్పం అర్బన్ పోలీస్ స్టేషన్‌కు ఎస్సైలుగా నియమించారు. కాగా నేడో రేపో నూతన ఎస్సైలు విధుల్లో చేరనున్నారు.

వార్త ప్రభావం

## చెరువునుంచి అక్రమంగా మట్టితరలింపు నిలిపివేత

శాంతిపురం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : మండలంలోని అబకలదొడ్డి పంచాయతీ బెండకుప్పం చెరువులో అక్రమ మట్టి తరలింపును అధికారులు నిలిపేశారు. మంగళవారం 'వార్త'లో బెండకుప్పం చెరువు చెర పడుతున్నారు అనే కథనం వెలువడిన విషయం విదితమే. దీంతో అధికార యంత్రాంగం స్పందించి చెరువులో మట్టి తరలింపుకు అడ్డుకట్ట వేశారు.

## పారదర్శకంగా పరిహారం అందజేయాలి



తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : చెన్నై, బెంగుళూర్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టు అభివృద్ధి కోసం కొత్త పట్నం (గ్రామ కోట మండలం) తమ్మిన పట్నం (చిల్లకూరు మండలం)లో ప్రభుత్వ భూముల సాగులో ఉన్న రైతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నష్ట పరిహారం అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చెన్నై,బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టు వలన మంచి పరిశ్రమ ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలో పంపించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి జీవోఎంఎస్ నెం.43 రూ. 78,84,83,200లు మంజూరు చేసిందని తెలిపారు. సంబంధిత తహశీల్దార్లు సాగులో ఉన్న భూములను సర్వే చేసి ఎలాంటి అవకతవకలు లేకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసే నిర్ధారణ చేసుకున్న తర్వాతనే పరిహారం అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నెల్లూరు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు విజయ్ భరత్‌రెడ్డి, శివకుమార్, కోట, చిల్లకూరు మండలాల తహశీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

## కాదేది మోసానికి అనర్హం



### - సైబర్ నేరగాళ్ళతో అప్రమత్తం - ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: మోసం చేయడానికి కాదేది అనర్హమని సైబర్ నేరగాళ్ళతో అప్రమత్తంగా వుండాలని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. సాంకేతికత అభివృద్ధి చెందడంతో సైబర్ నేరగాళ్ళు సైతం తమ నైపుణ్యాలను పెంచుకుని నేరాలకు పాల్పడుతున్నారన్నారు. అసమర్ధ పాస్‌వర్డ్‌లు, అవగాహన లేకుండా క్లిక్ చేసే లింకులు, వ్యక్తిగత వివరాలను పంచుకోవడం వంటి చర్యలు సైబర్ నేరగాళ్ళకు సహకరిస్తున్నాయన్నారు. ప్రజలు తమ డేటాను అప్రమత్తంగా వుంచుకోవడం, మోసపూరిత మెసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కు సమాధానం ఇవ్వకుండా వుండటం, ఆన్‌లైన్ లావాదేవిల్లో జాగ్రత్తగా వ్యవహరించడం అవసరం అన్నారు. ఇతర నేరాలతో పోల్చితే ప్రతి ఏడాది సైబర్ నేరాలు 12 శాతం పెరుగుతున్నాయన్నారు. తక్కువ డబ్బు పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తం వస్తుంది ఆశ పెట్టడం, డబ్బులు చెల్లిస్తే ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసి పలు దఫాలు ఎక్కువ మొత్తం డబ్బులు తీసుకోవడం, పార్ట్ టైమ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పంపడం తదితరాలగా సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. సులభంగా ఎక్కడైనా డబ్బులు వస్తాయని తెలిస్తే దాని వెనుక మోసం వుందని ప్రజలు గ్రహించాలన్నారు. మహిళలు ఆన్‌లైన్ స్నేహాల పట్ల జాగ్రత్తగా వుండాలని, సైబర్ నేరగాళ్ళు స్నేహం చేయడానికి తరచు ఫేక్ ప్రొఫైళ్ళు సృష్టిస్తారని, అనుమానం వచ్చిన మెసేజ్, కాల్స్‌కు సమాధానం ఇవ్వకూడదన్నారు. అలాగే ఏ ఒక్కరు వ్యక్తిగత సమాచారంను ఎవరికి వెల్లడించవద్దన్నారు. పాస్ వర్డ్‌లను భద్రంగా వుంచుకోవాలని పాస్ వర్డ్‌లను ఎవరికి షేర్ చేయవద్దన్నారు. లోన్ యాప్స్ ద్వారా ఒక్కసారి రుణం తీసుకుంటే జీవితాంతం బాధపడాల్సి వస్తోందన్నారు.

## అమ్మా నాన్న లేరని తోబుట్టువులను కాపాడా!

### -రెక్కలొచ్చాక బయటకు తోసేశారు -ఆదుకోండి మహాప్రభో



ఎ.కొత్తకోట(చౌడేపల్లి), ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : చిన్నతనంలోనే అమ్మానాన్నలు చనిపోతే అన్నీ నేనై చూసుకొన్నా...ఆకలని అన్నమడిగితే కూలీ నాలీ కూడు పెట్టా...పుట్టింట తోడపుట్టిన వారు అనాధలు కాకూడదని మరెన్నో త్యాగాలు చేసా...రెక్కలొచ్చాక గతాన్ని మరచిపోయారు...తమ్ముళ్ళను తల్లిలా లాలించినా కనికరం లేకుండా మెడపట్టి గెంటేశారు...దయగల హృదయమున్న వారు ఆదుకోండి మహాప్రభో ... అంటూ ఓ వృద్ధురాలు వేడుకొంటోంది...తైల సంస్కారంలేని పత్తిలాంటి జుట్టు గద్గధ గొంతేసుకొని ఏడ్చుతూ తన బాధను తెలుపింది రోడ్డున పడ్డ ఓ బాధితురాలి కథనం మేరకు... మండలంలోని పంచాయతీ కేంద్రం ఎ.కొత్తకోటకు చెందిన భజంత్రీ వెంకటేష, మున్నెమ్మలకు ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు సంతానం. వారిలో ఒక మహిళ మృతి చెందింది. ప్రస్తుతం భజంత్రీ లక్ష్మమ్మ, భజంత్రీ వెంకట్రమణ, భజంత్రీ గురు స్వామిలు ఉన్నారు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే మరణించడంతో తమ్ముళ్ళను చూసుకొంటూ బతికానని లక్ష్మమ్మ తెలిపింది. తాను రాయలపేటలో వివాహం చేసుకొన్నప్పటికి తమ్ముళ్ళ ఆలనా పాలనా చూసుకొనేందుకు పుట్టింటిలోనే వుండిపోయానంది. తాను సంవత్సరం క్రితం వరకు పెద్ద తమ్ముడు వెంకట్రమణ ఇంట్లోనే వుండేదాననీ, అయితే వారందరూ కొత్తింటిలోకి వెళ్ళాక నన్ను బయటకు గెంటేశారని వాపోయింది. ఆ తర్వాత ప్రభుత్వం వారు ఇచ్చే ఫించనుతో వేరొక చోట అద్దెఇంట్లో వున్నానని తెలిపింది. అయితే తన తమ్ముళ్ళు ఇంటి యజమానిని బెదిరించి అక్కడ ఖాళీ చేయించారనీ, తాను పరపంచన పడుకోవాల్సి వస్తోందని రోదిస్తూ పేర్కొంది. కష్టకాలంలో అండగా వుంటారని రెక్కలు ముక్కలు చేసుకొని తన సంపాదనంతా తోడబుట్టిన తమ్ముళ్ళ పెడితే కాటికి కాలు చాచిన తనను నిరాధరణకు గురి చేశారని లక్ష్మమ్మ కన్నీటి పర్యంతమైంది. తీవ్ర చలిలో ఆరుబయట నిద్ర, ఆకలితో సహవాసం చేసుకొంటూ బతుకీడ్చుతున్నాననీ, దయగల దాతలు ఆదుకోవాలని ఆమె కోరుకొంటోంది.

## బాల్ బాడ్మింటన్‌లో మెరుస్తున్న రాకెట్...కార్తిక్

### - వరుసకట్టి పతకాలు సాధిస్తున్న క్రీడాకారుడు - రెండు సార్లు స్టార్ ఆఫ్ ఆంధ్రగా ఎంపిక ఇండియన్ రైల్వేస్‌కు ఎంపికై జాతీయ స్థాయి విజేతగా నిలిచిన వైనం



తిరుపతి క్రీడ, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : చిన్నతనం నుంచి బాల్‌బాడ్మింటన్ క్రీడపై మక్కువ.. పట్టువదలక సాధన.. అనుకున్న లక్ష్యం వైపుగా అడుగులు.. పల్లె నుంచి జాతీయ స్థాయి దాకా పతకాలు సాధిస్తూ ముందడుగు... వరుసకడుతూ చేరుతున్న పతకాలు. రైల్వేస్‌లో ఉద్యోగం తెప్పించిన క్రీడా ప్రతిభ ఆపై ఇండియన్ రైల్వేస్ జట్టుకు ఎంపికై విజేతగా నిలిచాడు. క్రీడ ఇచ్చిన స్ఫూర్తితో ఉద్యోగ నిర్వహణలోను అవార్డులు సాధిస్తున్నాడు. ఇది కూపు చంద్రపేట గ్రామానికి చెందిన కార్తిక్ అనే క్రీడాకారుని ఘనత. –తిరుపతి రూరల్ మండలం కూపుచంద్రపేట గ్రామానికి చెందిన పి.లోకనాథం, లత దంపతుల కుమారుడు పి.కార్తిక్ బాల్‌బాడ్మింటన్ క్రీడలో అత్యంత ప్రతిభ కనభరుస్తున్నాడు. చిన్నతనంలో గ్రౌండ్‌లో ఆడుకుంటుండగా బాల్‌బాడ్మింటన్ క్రీడ ఆడుతున్న వారు ఇతన్ని ఆకర్షించారు. దీంతో ఆ ఆటపై మక్కువ పెరిగింది. ఆ మక్కువను తన లక్ష్యంగా మలచుకున్నాడు. పట్టువదలక సాధన చేస్తూ మండల స్థాయిలోను, జిల్లా స్థాయిలను ప్రతిభ కనభరుస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదుగుతూ వచ్చాడు.

**- కార్తిక్ సాధించిన పతకాలు:** 2010–11వ ఏడాది మధురై, తమిళనాడు వారు నిర్వహించిన సబ్ జూనియర్స్ నేషనల్స్‌లో పాల్గొని 2వ స్థానం సాధించాడు. 2013లో హర్యానాలో జరిగిన జూనియర్ నేషనల్స్‌లో పాల్గొని 2వ స్థానం సాధించాడు. 2014లో భిలాయిలో జరిగిన జూనియర్ నేషనల్స్‌లో 2వ స్థానం సాధించాడు. 2015 – 16లో మంగుళూరులో నిర్వహించిన అల్ ఇండియా యూనివర్సిటీ బాల్ బాడ్మింటన్ పోటీలో 2వ స్థానం సాధించాడు. 2017–18లో కడపలో నిర్వహించిన అల్ ఇండియా యూనివర్సిటీ బాల్ బాడ్మింటన్ పోటీలో 2వ స్థానం సాధించాడు. 2017–18లో బీహార్‌లో నిర్వహించిన యూత్ నేషనల్ బాల్ బాడ్మింటన్ పోటీలో ఆంధ్రటీంకు కేప్టెన్‌గా ఎంపికై ప్రథమ స్థానంలో నిలిచాడు. 2018లో హర్యానాలో నిర్వహించిన సీనియర్ నేషనల్స్‌లో పాల్గొని 3వ స్థానం సాధించాడు. రెండు సార్లు స్టార్ ఆంధ్ర అవార్డును అందుకున్నాడు. 2018లో ఈస్ట్‌కోస్ట్ రైల్వేస్, విశాఖపట్నంలో క్రీడా ప్రతిభ ఆధారంగా ఉద్యోగం సంపాదించాడు. 2022లో ఉత్తమ ఉద్యోగి డీఆర్ఎం అవార్డును దక్కించుకున్నాడు.

## కేంద్ర మంత్రులకు శివరాత్రి ఆహ్వానం

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 11 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మంగళవారం ఉదయం నుంచి ఢిల్లీలోని పలువురు మంత్రులను ఆహ్వానించారు. మరో రెండు రోజుల్లో ప్రధాని నరేంద్రమోదీని ఆహ్వానించనున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి అనకాపల్లి ఎంపి సిఎం రమేష్, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రదాన్,మనసుఖ్‌మండేయియా,విజయవాడ పార్లమెంటు సభ్యులు హరీష్‌బాలయోగిలకు శ్రీకాళహస్తీశ్వరాలయం, గుడిమల్లంలోని పరశురామేశ్వరాలయంలో జరిగే శివరాత్రి ఆహ్వాన పత్రికలను అందించినట్లు సుధీర్‌రెడ్డి వివరించారు.

**దేవేగౌడ్ ఆశీర్వచనాలు:**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబందించి మాజీ ప్రధాని దేవగౌడ్‌ను కలసి ఆహ్వాన పత్రికలను అందించారు. ప్రధానిగా ఆయన శ్రీకాళహస్తీశ్వరుని పూజలు జరిపే వారు. ఒక సారి ఆయన కుటుంబ పరివారంతో శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధి లో తన జన్మదిన వేడుకలను జరుపుకున్నారు.ఈ అంశాన్ని దేవగౌడ్ సుధీర్‌రెడ్డితో పంచుకున్నట్లు సమాచారం. మంత్రులను కలసినపుడు శ్రీకాళహస్తి అభివృద్ధికి నిధుల కోసం అభ్యర్థించినట్లు సమాచారం.

## ఆ ముగ్గురు ఆచూకీ లభ్యం?...

తిరుపతికార్పొరేషన్,ఫిబ్రవరి 11ప్రభాతవార్త: మనస్పర్థలు, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న ఓ కుటుంబంలో ముగ్గురు కనిపించకుండా పోవడం, ఆలస్యంగా వారంతా సురక్షితంగా తిరుపతిలోనే బంధువుల ఇంట్లో ఉన్నట్లు తెలియడంలో అంతా ఊపిరిపీల్చుకున్నారు. వెంకటేశ్ కుటుంబంతో లక్ష్మీపురంలో నివాసముంటున్నాడు. కొంతకాలంగా అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబంలో ఆర్థికంగా సమస్యలు, గొడవలు తలెత్తేవి. ఈనెల 7వతేదీ భార్యాభర్తల మధ్య గొడవలతో ఆమె పిల్లలతో బయటకు వెళ్ళిపోయింది. దీనిపై మంగళవారం రాత్రి వారంతా తిరుపతిలోనే ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది.

## మహనీయుల ఆదర్శంతోనే మెట్లోత్సవం



తిరుమల,ఫిబ్రవరి 11ప్రభాతవార్తప్రతినిధి: ఎందరో మహనీయులు భక్తిప్రపత్తులతో వేంకటాద్రి పర్వతాన్ని కాలినడకన అధిరోహించి స్వామివారి అనుగ్రహం పొందారని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. అలాంటివారి అడుగుజాడల్లో నడిచి ఆ దేవదేవుని కృపకు పాత్రులు కావాలని తలంపుతో దాస సాహిత్య ప్రాజెక్టు మెట్లోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరుగు తుందన్నారు. మంగళవారం సాయంత్రం ఆస్థానమండపంలో భజనమండలి కళాకారులతో, దాసాహిత్యప్రాజెక్టు ప్రాజెక్టు అధికారి ఆనందతీర్థాచార్యులతో కలసి పలు అంశాలు తెలిపారు. నేటి ఉదయం 4గంటలకు అలిపిరి పాదాలమండపం వద్ద మెట్లపూజ నిర్వహిస్తారు.